మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 04 సోమవారం | నవంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 49

Navabhoomi daily fallows..

ANU FURNITURE®
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033



# ఎవరి సర్వేలు వాళ్లవి?

- తెలంగాణ రాష్ట్రంలో సర్వేల జాతర
- ఒక వైపు కాంగ్రెస్,మరో వైపు బీఆర్ఎస్
- సర్వేల రూపకల్పనలో బిజీబిజీ
- పదినెలల పాలనపై కాంగ్రెస్ సర్వే
- కాంగ్రెస్ పథకాల అమలుపై బీఆర్ఎస్
- రాష్ట్రవ్యాప్తంగా సర్వేలు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సర్వే.. ఎందుకోసమంటే..? కానీ.. ఇప్పుడు సర్వేలు జరుగుతుండడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇంతకీ ఆ సర్వేలు ఎవరు చేయిస్తున్నారు..? ఎందుకు చేయిస్తున్నారు..? తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం సర్వేల జాతర నడుస్తోంది. ఎవరైనా ఎన్నికలకు ముందు సర్వేలు చేపట్టడం కామన్. ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి..? ప్రజల మద్దతు ఎవరికి ఉంది..? అని సర్వేల ద్వారా తెలుసుకోవడం ఆనవాయితీ. కానీ.. తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు గడిచింది. కానీ.. ఇప్పుడు సర్వేలు జరుగుతుండడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇంతకీ ఆ సర్వేలు ఎవరు చేయిస్తున్నారు..? ఎందుకు చేయిస్తు న్నారు..? తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు గడిచింది. మరో రెండు నెలల్లో ఏడాది పూర్తిచేసుకోబోతోంది. ఈ క్రమంలో ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఫీలింగును తెలుసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు ఏమనుకుంటున్నారు..? పథకాల లక్ష్యాలు ఎలా ఉన్నాయి..? పథకాలపై వారి ఫీడ్ బ్యాక్ ఏంటి..? గత పదేళ్లకు ఇప్పటికి సంతృప్తికరంగా ఉన్నారా..? ఇంకా ప్రజలు ఏం కోరుకుంటున్నారు..? బీఆర్ఎస్ నాయకుల వైఖరి మీద ఏం అనుకుంటున్నారు..? ఈ పది నెలల కాలంలో ప్రభుత్వ సక్సెస్‌లు ఏంటి..? ప్రభుత్వ వైఫల్యాలు ఏంటి..? లోకల్ ప్రజాప్రతినిధుల పనితీరు ఎలా ఉంది..? మంత్రులు ఎలా స్పందిస్తున్నారు..? స్థానిక నేతలు ప్రజలను పట్టించుకుంటున్నారా..? ఆరు గ్యారంటీలపై ప్రజల్లో ఎలాంటి టాక్ ఉంది..? ఇలా తదితర ప్రశ్నలతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నల్‌గా ఈ సర్వే చేస్తున్నారు. సర్వేలో వచ్చిన అభిప్రాయాలతో భవిష్యత్తులో పాలనాపరంగా మార్పులు.. కావాల్సిన పథకాలకు రూపకల్పన చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. అంతేకాకుం డా పదేండ్ల తరువాత అధికారంలోకి రావడంతో.. సక్సెస్‌ఫుల్‌గా వన్ ఇయర్ పూర్తి చేసుకుంటుండడంతో వన్ ఇయర్ సంబరాలను కూడా గ్రాండుగా నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటి వరకు ఓకే.. ఇక, నుంచి బాబుకు

# అప్పుల్లో టాప్ ఏపీ!

- ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అప్పులెక్కువ
- ప్రతీ లక్ష మందిలో 64,953 మంది రుణగ్రస్తులే
- దేశంలో ఎక్కడా లేనంత అప్పులు ఏపీలోనే..
- తెలంగాణలో ప్రతీ లక్ష మందికి 42,407 మందికి అప్పు
- జాతీయ శాంపుల్ సర్వే సంస్థ (ఎఎస్ఎస్వో) వెల్లడి



**అమరావతి-నవభూమిబ్యూరో**

అప్పుల విషయంలో ఆంధ్రుల్ని దేశంలో కొట్టేవారే లేరు.. షాకింగ్ గణాంకాలు! ఇందులో భాగంగా... ఏపీలోని గ్రామీణ ప్రాంత మహిళలకు అప్పులు ఎక్కువగా ఉన్నాయని.. ప్రతీ లక్ష మందిలో 64,953 మంది రుణగ్రస్తులే అని వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారిలో ప్రతీ లక్ష మందికి 42,407 మందికి అప్పు ఉందని జాతీయ శాంపుల్ సర్వే సంస్థ (ఎ.ఎస్.ఎస్.వో) వెల్లడించిన సంగతి తెలిసిందే. గ్రామీణ ప్రాంతల్లో వీరి సంఖ్య ప్రతీ లక్షమందిలో 50,289గా ఉండగా.. పట్టణాల్లో 31,309 గా ఉందని తెలిపింది. ఈ విషయంలో తాజాగా ఆంధ్రుల లెక్కలు తెరపైకి వచ్చాయి. అవును... 18ఏళ్లు పైబడిన ప్రతీ లక్ష మంది జనాభాలో 60,092 (60%) మందికి అప్పులు ఉన్నాయని.. దేశంలోని మరే రాష్ట్రమూ ఈ విషయంలో ఆంధ్రులకు దరిదాపుల్లో లేదని.. జూలై 2022 - జూన్ 2023 మధ్య కేంద్ర గణాంకశాఖ నిర్వహించిన శాంపుల్ సర్వే (కాంప్రహెన్సివ్ యాన్యువల్ మాడ్యులర్ సర్వే 2022 - 23) వెల్లడించింది. ఈ సందర్భంగా... దేశంలో సగటున లక్ష మందిలో 18,322 మంది మాత్రమే అప్పుల్లో ఉంటే.. ఏపీలో మాత్రం వారి సంఖ్య 228% అధికంగా.. 60,092 గా ఉందని నివేదిక తెలిపింది. ఇక ప్రధానంగా... పురుషులతో పోలిస్తే మహిళలపై రుణభారం ఎక్కువగా ఉందని.. ఈ విషయంలోనూ ఏపీ టాప్ ప్లేస్ లో ఉందని నివేదిక చెబుతోంది! ఇందులో భాగంగా... ఏపీలోని గ్రామీణ ప్రాంత మహిళలకు అప్పులు ఎక్కువగా ఉన్నాయని.. ప్రతీ లక్ష మందిలో 64,953 మంది రుణగ్రస్తులే అని వెల్లడించింది. పంజాబ్ గ్రామీణ ప్రాంతల్లో లక్ష మంది పురుషుల్లో 20,673 మందికి అప్పులుంటే.. మహిళల సంఖ్య 5,604 మంది మాత్రమే అప్పులు కలిగి ఉన్నారు. ఇక రాజస్థాన్ లో ప్రతీ లక్ష మంది పురుషుల్లో 23,675 మందికి అప్పులు ఉంటే.. ప్రతీ లక్షమంది మహిళల్లోనూ 5,161 మందికి మాత్రమే అప్పులు ఉన్నాయి. ఇక ఒడిశాలో లక్షమంది పురుషుల్లో 20,722 మందికి అప్పులు ఉండగా.. మహిళల్లోనూ దాదాపు సమానంగా 20,593 మందికి అప్పులు

## తెలంగాణలో బీసీ కులగణనకు
# ప్రత్యేక కమిషన్

- నేటిలోగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- హైకోర్టు తీర్పునకు అనుగుణంగా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు
- స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన చిక్కులు
- తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- అందరి ఏకాభిప్రాయం మేరకు తక్షణమే కమిషన్ ఏర్పాటు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో బీసీ కుల గణనకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు రేపటిలోగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందరి ఏకాభిప్రాయం మేరకు తక్షణం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కులగణన సంబంధిత అంశాలపై సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల నేపథ్యం, న్యాయస్థానాలు లేవనెత్తిన పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ తన నివాసంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ నెల 6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని స్పష్టం చేశారు.

అందరి అభిప్రాయాల మేరకు వెంటనే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం

# టీడీపీలోకి వాసిరెడ్డి పద్మ?

- వైసీపీకి రాజీనామా తర్వాత టీడీపీలోకి వెళ్లే ఆలోచనలో వాసిరెడ్డి పద్మ
- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ద్వారా పార్టీలో చేరే అవకాశం



**అమరావతి-నవభూమిబ్యూరో**

వాసిరెడ్డి పద్మ చేరబోయే పార్టీ గురించి హింట్ ఇచ్చేశారా అన్న చర్చ అయితే సాగుతోంది. టీడీపీ వైపుగా ఆమె అడుగులు పడుతున్నాయని అంటున్నారు. వాసిరెడ్డి పద్మ ప్రజారాజ్యం నుంచి వైసీపీ వైపుగా వచ్చి అక్కడ తన రాజకీయాన్ని వేగం పెంచి ఏపీలో కీలక మహిళా నేతగా ఎదిగారు. వైసీపీలో ఆమె రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా పనిచేశారు. కేబినెట్ ర్యాంక్ కలిగిన కీలకమైన పదవి అది. అంతే కాదు అమె వైసీపీలో బలమైన మహిళా నేతగా ఉంటూ వచ్చారు. ఆమె పార్టీ తరఫున వాయిస్‌ని గట్టిగా వినిపిస్తూ ప్రత్యర్థులను హడలెత్తించేవారు. ఇదిలా ఉంటే ఆమె కొద్ది రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేశారు. ఆమె వైసీపీని వీడిపోతున్న సమయంలో జగన్ మీద తీవ్ర విమర్శలు చేశారు. అవి ఏపీలో సంచలనంగా మారాయి. పార్టీని -2లో

## 11 నుంచి ఏపీ
# అసెంబ్లీ సమావేశాలు

- అదే రోజున బడ్జెట్ ప్రవేశపెట్టే ఛాన్స్
- పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సర్కార్
- 10 రోజుల పాటు సమావేశాలు

**అమరావతి-నవభూమిబ్యూరో:** అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. అదే రోజు ఉదయం 10 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనుంది. ఇప్పటివరకూ ఉన్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కనీసం పదిరోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. బడ్జెట్‌తోపాటు ఇతర బిల్లులను సభ ముందుకు తీసుకురానుంది.




# రెండో రాజధానిగా వరంగల్

- కేంద్రం అనుమతిస్తే మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి
- సీఎం రేవంత్ వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్న మంత్రి
- కాళోజీ కళా క్షేత్రాన్ని ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి పనులకు
- త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- వరంగల్‌లోని పలు అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఆదివారం ఆయన వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు.

ముందుగా ఆలయానికి వచ్చిన మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఆలయ మాడ వీధులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఇక్కడి జలాశయాన్ని తాగునీటి జలాశయంగా మారుస్తామన్నారు మంత్రి శ్రీనివాస్ రెడ్డి. భద్రకాళి చెరువు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే చేయించి నిర్మాణాలను తొలగిస్తామని చెప్పారు. అయితే, జలాశయానికి సంబంధించిన వివరాలను అధికారులను అడగగా సరిగా స్పందించకపోవడంతో అధికారుల తీరుపై మంత్రి మండిపడ్డారు.

ఈ క్రమంలోనే మంత్రి రాష్ట్ర రెండో రాజధాని అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు.

వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

కేంద్రం అనుమతిస్తే మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మరోవైపు వరంగల్ నగరంలోని పలు అభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. త్వరలోనే నగరంలోని కాళోజీ కళా క్షేత్రాన్ని ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.

## ఏపీలో మరోసారి
# పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- చెరుకూరి శ్రీధర్‌ను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్‌గా బదిలీ
- జి లక్ష్మీషాను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ
- పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా అభిషిక్త కిషోర్ అదనపుబాధ్యతలు
- ప్రభుత్వ యంత్రాంగం మీద పట్టు పెంచుకునే ప్రయత్నంలో భాగంగా ఈ బదిలీలు




**అమరావతి-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జీఓఆర్టీ నెంబర్ 1884 ఉత్తర్వులు జారీ చేశారు.

చెరుకూరి శ్రీధర్‌ను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు.

జి లక్ష్మీషాను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. అభిషిక్త కిషోర్‌కు పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు వహించాలని ఉత్తర్వుల్లో వెల్లడించారు. విసి ఎండీ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎన్టీఆర్ వైద్య సేవ పథకం సీఈవో పోస్టులకు తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఇన్‌చార్జిలను నియమించాలని వైద్యారోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ యంత్రాంగం మీద పట్టు పెంచుకునే ప్రయత్నంలో భాగంగా ఈ బదిలీలు చేపట్టారు. చర్యల్లో భాగంగా ఇప్పటికే

# తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం

- సంక్రాంతి తర్వాత తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్నబియ్యం పంపిణీ
- వరి ధాన్యం 150 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి: మంత్రి ఉత్తమ్
- ప్రోత్సాహకంగా సన్న వరిధాన్యం పండించిన రైతులకు రూ. 500 బోనస్
- గడ్డిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- మంత్రి ఉత్తమ్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రి కోమటిరెడ్డి హాజరు



**గరిడేపల్లి-నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలో సంక్రాంతి తర్వాత తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నీటి పారుదల

# అలిగి వెళ్లిపోయిన నెల్లూరు ఎంపీ

- అధికారి తప్పిదం.. వేదికపై నుంచి వెళ్లిపోయిన ఎంపీ వేమిరెడ్డి
- నెల్లూరు రూరల్ ఆర్డీవో ప్రత్యూష మంత్రులకు స్వాగతం పలుకుతూ
- ఎంపీ పేరును మర్చిపోవడంతో వేమిరెడ్డి ఆగ్రహం
- మంత్రి ఆనం వేదిక దిగి ఎంపీని బతిమలాడినా ససేమిరా



**నెల్లూరు-నవభూమిబ్యూరో:** నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అవమానం జరిగింది.

రివ్యూ మీటింగ్‌లో హోస్ట్‌గా వ్యవహరించిన నెల్లూరు రూరల్ ఆర్డీవో ప్రత్యూష మంత్రులకు స్వాగతం పలికే కార్యక్రమంలో భాగంగా బొకేలు సమర్పించి వేమిరెడ్డి పేరును విస్మరించడంతో ఆయన వేదికపై నుంచి అలిగి వెళ్లిపోయారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వేదికపై నుంచి కిందకు వెళ్లి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సముదాయించేందుకు ప్రయత్నించారు. స్టేజ్‌పై తనకు తగిన గౌరవం దక్కలేదని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎంపీ వెంట కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా సభ నుంచి

# 5న హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ, ఖర్గే..!

**హైదరాబాద్‌-నవభూమి::**ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నవంబర్ 5న తెలంగాణకు రానున్నారు. ఇందుకు సంబంధించి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఓ ప్రకటన చేశారు.
మంగళవారం వారిద్దరూ హైదరాబాద్ కు వస్తారని చెప్పారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు బోయినపల్లిలోని మహాత్మా గాంధీ ఐడియాలజీ సెంటర్?లో మేధావులు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన పెద్దలతో రాహుల్, ఖర్గే భేటీ అవుతారని వివరించింది. తెలంగాణలో కుల గణన ఎలా చేయాలి.. ఆ తర్వాత ఏం చేయాలానేది చర్చించనున్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన మేధావుల సూచనలు స్వీకరించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక మేరకు ఖర్గే, రాహుల్ హైదరాబాద్ వస్తున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కులగణన విషయంలో రాహుల్‌గాంధీ కి ఉన్న చిత్తశుద్ధికి ఈ పర్యటనే సాక్ష్యమని అన్నారు. కుల గణన సర్వేలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భాగస్వామి కావాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో శనివారం డీసీసీ మీటింగ్ లు ఏర్పాటు చేసి, కుల గణనపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయడం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.
పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. పీసీసీ ఆధ్వర్యంలో నవంబర్ 6 లేదా 7న అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. కుల గణనపై అన్ని పార్టీల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటామని వివరించారు. పార్టీ ఎమ్మెల్యేలను, వివిధ రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లను ఇంఛార్జీలుగా నియమిస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ సర్కార్ ముందుకెళ్తుందని వివరించారు.



## త్వరలోనే న్యూ ఎనర్జీ పాలసీని తీసుకొస్తాం : డిప్యూటీ సీఎం భట్టి



**యాదాద్రి భువనగిరి -నవభూమి:** వచ్చే ఏడాది మే నాటికి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను పూర్తి చేసి 4వేల మెగావాట్ల విద్యుత్తును గ్రిడ్డుకు అనుసంధానం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క(అన్నారు. ఆదివారం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మంత్రుల బృందం పర్యటించిది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. యాదాద్రి పవర్ ప్లాంట్ స్టేషన్ లోని స్టేజి-1 లో అవుతున్న విద్యుత్ ఉత్పత్తిని గ్రిడ్డుకు అనుసంధానం చేసే కార్యక్రమం ఈరోజు విజయవంతంగా జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని 2028-29 నాటికి 22,288 మెగావాట్లు అవకాశం ఉంటుందని అంచనా వేశారు.
విద్యుత్తుకు ఇబ్బంది రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాతావరణం కలుషితం కాకుండా 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో న్యూఎనర్జీ పాలసీని త్వరలోనే తీసుకువస్తామని స్పష్టం చేశారు. న్యూ ఎనర్జీ పాలసీని తీసుకురావడంలో మేధావులు విద్యుత్తు నిష్ణాతులతో చర్చించి వారి అభిప్రా యాలు తీసుకొని శాసనసభలో చర్చించి అందరి అభిప్రాయంతో న్యూ ఎనర్జీ పాలసీ తీసుకువస్తామన్నారు.

## చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి.. నిజామాబాద్ జిల్లాలో ఘటన

**నిజామాబాద్-నవభూమి:** నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఆదివారం మోపాల్ మండలం మంచిప్పలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..హైదరాబాద్‌కు చెందిన కొందరు మంచిప్పలోని దర్గాకు వచ్చారు. దర్శనం అనంతరం వీరిలో ఇద్దరు యువకులు సరదగా స్థానిక పెద్ద చెరువులో దిగి నీట మునిగారు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.
స్థానికులు చెరువులో గాలించగా సయ్యద్ మూస అనే యువకుడి మృతదేహం లభ్యమైంది. అనంతరం రెస్క్యూ టీం ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా మరో యువకుడు సయ్యద్ వాసిక్ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ యాదగిరి గౌడ్ మృతదేహాలను పంచనామా చేసి ప్రభుత్వ హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. దైవదర్శనానకి వచ్చిన యువకులు అనంతలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

## గోవా నుంచి కలకత్తా వెళ్తున్న విమానానికి బాంబు బెదిరింపు




**హైదరాబాద్‌-నవభూమి:**గోవా నుంచి కలకత్తా వెళ్తున్న విమానానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో అధికారులు హైదరాబాద్, శంషాబాద్ ఎయిర్ పోర్టులో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. విమానంలో ప్రయాణిస్తున్న 180 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎయిర్ పోర్టు భద్రతా సిబ్బంది ప్రయాణీకులను కిందకు దించి విమానంలో తనిఖీలు చేపట్టారు. కాగా ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి.%కాగా విమానాలకు వరుస బాంబు బెదిరింపుల వేళ అప్రమత్తంగా ఉండాల్సిన తరుణంలో భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. అక్టోబరు 27న దుబాయ్ నుంచి ఢిల్లీ వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో తూటా లభ్యమైంది. ఏఐ 916 విమానంలో సిబ్బంది శుభ్రం చేస్తుండగా ప్రయాణికుల సీట్ పాకెట్‌లో తూటా దొరికింది. దీంతో ఆయుధ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి శనివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఖాట్మాండూ నుంచి ఢిల్లీ వెళ్లే విమానంలో బాంబు ఉందంటూ అగంతకులనుంచి సమాచారం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నేపాల్ రాజధాని ఖాట్మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు 4 గంటల పాటు తనిఖీలు చేశారు. చివరకు బాంబు బెదిరింపు ఉత్తిదే అని తేల్చారు. గతనెల 28న కూడా నేపాల్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానానికి కూడా ఇలాగే బాంబు బెదిరింపు వచ్చింది. సోషల్ మీడియా ద్వారా శనివారం మొత్తం 19 ఇండిగో విమానాలకు బెదిరింపులు వచ్చాయని అధికారులు తెలిపారు. గత రెండు వారాల్లో ఇప్పటివరకు 510 స్థానిక, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. కాగా, బిహార్‌లోని దర్భంగా నుంచి న్యూఢిల్లీ వచ్చే బిహార్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు కూడా శుక్రవారం సాయంత్రం ఇలాంటి హెచ్చరికే వచ్చింది. దీంతో రైలును మధ్యలో ఓ స్టేషన్‌లో నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.కాగా దేశవ్యాప్తంగా పలు విమానాలకు బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతోంది. ఆ క్రమంలో మంగళవారం చెన్నై- విశాఖ, బెంగళూరు-విశాఖ ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో విశాఖ విమానాశ్రయంలో ప్రయాణికులను కిందకి దింపి భద్రతా సిబ్బంది ఆయా విమానాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎక్కడ ఏ విధమైన పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో విమానాశ్రయ అధికారులతోపాటు ప్రయాణికులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.ఇండిగో ఎయిర్‌లైన్స్ స్టేషన్ మేనేజర్‌కు సాయంత్రం 05:38 గంటలకు బాంబు బెదిరింపు ట్వీట్ అందింది. దీంతో విమానాశ్రయ అధికారులకు స్టేషన్ మేనేజర్ అప్రమత్తం చేశారు. అయితే ఆడమ్ లామ్జా 202 ఐడీ నుంచి ట్వీట్ వచ్చినట్లు ఇండిగో సంస్థ వెల్లడించింది. అయితే ఈ రెండు విమానాలకు సెక్యూరిటీ క్లియరెన్స్ లభించింది. దీంతో బోర్డింగ్‌ను ప్రయాణికులకు ఎయిర్ పోర్ట్ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో మూడు గంటల ఆలస్యంగా ఇండిగో విమానాలు బయలుదేరి గమ్యస్థానాలకు పయనమయ్యాయి.

## అతి త్వరలో కొత్త విద్యుత్ పాలసీ.. భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్‌-నవభూమి::** కొత్త విద్యుత్ పాలసీని రాష్ట్రంలో అతి త్వరలో తీసుకువస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇవాళ(ఆదివారం) పవర్ ప్లాంట్ రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిబంధనలను అనుసరించి గ్రీన్ ఎనర్జీని అందించేందుకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, పవన విద్యుత్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గం గడ్డిపల్లిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ముందు చెప్పినట్లే 2025మే నాటికి వైటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలిపారు. 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని గ్రిడ్డుకు అనుసంధానం చేస్తామని అన్నారు. తెలంగాణవ్యాప్తంగా గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. అధికారిక అంచనాల ప్రకారం 2028-29 నాటికి 24,488 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.2034-38 నాటికి 35,800 మెగావాట్ల విద్యుత్ రాష్ట్రానికి అవసరం ఉంటుందని అన్నారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు 20000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ పాలసీ కోసం విద్యుత్ రంగంలో అపార అనుభవం ఉన్న నిష్ణాతులను, అనుభవజ్ఞుల సలహాలతో ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. శాసనసభలో చర్చలు జరిపి అందరి సహకారంతో ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలో రాష్ట్రంలోకి బహుళ జాతి సంస్థలు పెద్ద ఎత్తున తరలి రాబోతున్నాయని తెలిపారు.వాటికి అనుగుణంగా విద్యుత్ అందించేందుకు ముందస్తు ప్రణాళికతో ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పూర్తి చేస్తాం..**

"పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు సంక్షేమ విద్యార్థుల మెస్ చార్జీలకు ఒక్క రూపాయి పెంచలేదు. బడుగు బలహీన వర్గాల కోసమే తెలంగాణ తెచ్చుకున్నాం. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం ఎస్ఎల్బీసీ సొరంగంలో ఒక్క కిలోమీటర్ కూడా పనులు చేయలేదు.. 20 నెలల్లో మా ప్రభుత్వంలో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపడుతున్నాం. మన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌లో వసతులు కల్పిస్తున్నాం. కేసీఆర్ ప్రభుత్వం గత ఏడాది రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ. 70 కోట్లు కేటాయించింది.. కానీ మా ప్రభుత్వం ఒకే ఏడాది రూ.5 వేల కోట్లు కేటాయించి నిరుపేద పిల్లలపై మాకున్న చిత్తశుద్ధిని చాటాం. అద్భుతమైన తెలంగాణను ఆవిష్కరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రిమండలి రోజుకు 18 గంటల పాటు పనిచేస్తున్నాం. ఈ రాష్ట్ర సంపద ప్రజలకు ఉపయోగపడాలి కానీ పాలకులు పంచుకోవడానికి కాదు" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## బామ్మర్ది టిల్లు.. బావ సొల్లు.. బీఆర్ఎస్ నేతలపై

### ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు



**హైదరాబాద్‌-నవభూమి:** బామ్మర్ది టిల్లు.. బావ సొల్లు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇచ్చిన హామీల మీద బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన రెండు మేనిఫెస్టోలు.. తమ ప్రభుత్వ ఒక్కో మేనిఫెస్టో తీసుకుని చర్చకు రావాలి.. తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఇవాళ(ఆదివారం) గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పది నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని స్పష్టం చేశారు.కేసీఆర్ పదేళ్లలో పది సార్లు కూడా సచివాలయంలో కూర్చున్న దాఖలాలు లేవని విమర్శలు చేశారు. తెలంగాణకు ఎంత వడ్డీ ఉందనేది తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల తర్వాత తేలిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ అభివృద్ధిని తుంగలో తొక్కారని మండిపడ్డారు. చివరకు అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని చేతులెత్తేశారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

**బావ, బామ్మర్ది మధ్య పోటీ ...**

"మా ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల లెక్కలు చెబుతాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్వీట్‌కి రేవంత్ రెడ్డి స్పందిస్తే.. దానికి హరీష్ రావు ట్వీట్ చేశారు. మా ప్రభుత్వం మీద అపవాదు వేయడం తప్ప మెరుగైన పాలన అందించేలా సలహాలు ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ హయాంలో రుణమాఫీకి వడ్డీ మాత్రమే కట్టారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఎన్ని కష్టాలు ఎదురైనా రుణమాఫీ చేశారు. మీకన్నా మెరుగైన పాలన అందించామా లేదా చెప్పండి. బీఆర్ఎస్ అధ్యక్ష పదవికి నోటిఫికేషన్ పడింది. దానికోసం బావ, బామ్మర్ది మధ్య పోటీ పెరిగింది.బీఆర్ఎస్ పార్టీనీ తెలంగాణ కోసం పెట్టలేదు. కలెక్షన్లు.. కమీషన్లు దండుకోవడానికి ఆ పార్టీ పెట్టారు. గతంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ అలయన్స్‌లో రబ్బరు చెప్పుల హరీష్ రావు మంత్రి అయ్యాడు" అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు.

**మహేశ్వర్ రెడ్డి కలెక్షన్స్ బాగా చేస్తున్నారు...**

"కాంగ్రెస్ పుణ్యాన మీ మామ కేసీఆర్ సీఎం.. మీ బావ లీడర్ అయ్యారు. కేకే మహేందర్ రెడ్డినీ కాదని కేటీఆర్‌కు టిక్కెట్ ఇచ్చి మహేందర్ రెడ్డికి అన్యాయం చేశారు. రాజ్యాంగం కూడా తెలియకుండా మళ్లీ ఎన్నికలు పెడితే 100 సీట్లు వస్తాయి అంటున్నారు సిగ్గు లేకుండా.. ఒక్క పార్లమెంట్ సీటు అయిన గెలుచుకున్నారా మీరు. బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు పదవి ఇచ్చి.. రూమ్ ఇచ్చాం. కానీ మహేశ్వర్ రెడ్డి కలెక్షన్స్ బాగా చేస్తున్నారని ఆయన్ను పక్కన పెట్టారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీలో ఉంటే మంత్రి అయ్యే వాడినని కలలు కంటున్నాడు.అందుకే ఏఐసీసీ నేతలు ఏం అనుకుంటున్నారనేది చెబుతున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి బ్రహ్మాండంగా మరో పదేళ్లు సీఎంగా కొనసాగుతాడు. అదృష్టం కొద్దీ మహేశ్వర్ రెడ్డి గెలిచాడు. బీజేపీ నేతగా ఉండి మేము అధికారంలోకి వస్తామని కూడా చెప్పకుండా..బీఆర్ఎస్ వస్తుందని చెబుతున్నాడు" అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

# ఎవరి సర్వేలు వాళ్లవి?

**హైదరాబాద్‌-నవభూమి:**సవాళ్ల పాలనే?! మరోవైపు.. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల తర్వాత ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి పదేళ్ల పాటు గులాబీ పార్టీనే అధికారంలో కొనసాగింది. అయితే.. గత పది నెలలుగా ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పెద్దగా ప్రజల్లో వచ్చిన దాఖలాలు లేవు. అధికారం కోల్పోయినప్పటి నుంచి ఒకటి రెండు సంద ర్భాల్లో మినహా ఆయన కనిపించలేదు. అనా రోగ్య కారణాలు వేధించడం.. కొత్త ప్రభుత్వా నికి కొంత సమయం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆయన ఫామ్‌హౌజ్ దాటి రావడం లేదని ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. సరే.. కారణాలు ఏవైనప్పటికీ కేసీఆర్ రాకకోసం ఆయన అభిమానులు మాత్రం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్ పార్టీ కూడా రాష్ట్రంలో సీక్రెట్ సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును తెలుసుకునేం దుకు ఈ సర్వే చేయిస్తోంది. గతంలో బీఆర్ఎస్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలపైనా ఆరా తీస్తోంది. ముఖ్యంగా.. రేవంత్ రెడ్డి సీఎం గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన పనితీరు ఎలా ఉంది..? కొత్త ప్రభుత్వం ఎలా కొనసాగుతోంది..? ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయి..? ఆయన భాష తీరు, ప్రతిపక్షాలపై, కేసీఆర్‌పై చేస్తున్న కామెంట్లతో ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉంది..? ఒకవేళ రేవంత్ స్థానంలో వేరే వ్యక్తి సీఎం అయితే ఎలా ఉంటుంది..? ఇచ్చిన గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలువుతున్నాయా..? లబ్ధిదా రులకు పథకాలు అందుతున్నాయా..? తెలం గాణ అభివృద్ధి రేవంత్‌తో సాధ్యం అవుతుం దా..? పరిశ్రమలను తీసుకురావడం లో ఏ మేరకు సఫలీకృతం అయ్యారు..? రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన కంపెనీలు మళ్లీ ఇతర రాష్ట్రాలకు తరలడానికి గల కారణా లు..? నిరుద్యోగులకు, విద్యార్థులకు ఏ మేరకు భరోసానిచ్చారు..? అటు రైతులకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలయ్యా యా..? మూసీ, హైడ్రాలపై ప్రజల్లో అభిప్రా యం ఎలా ఉంది..? ఇళ్లను కూల్చడంపై ప్రజలు ఏమను కుంటున్నారు..? ఇలా మరి కొన్ని ప్రశ్నలతో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అయితే.. ఈ సర్వే రిపోర్టు ఆధారంగానే బీఆర్ఎస్ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించ బోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధినేత కేసీఆర్ ప్రత్యేక ఆసక్తితో ఈ సర్వే చేయిస్తున్నా రని, ఈ రిపోర్టు ఆధారంగానే మరికొద్ది రోజుల్లో ఆయన ప్రజల్లోకి వచ్చి ప్రభుత్వంపై విరుచుకుపడే అవకాశాలు ఉన్నాయని పార్టీలో చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సర్వేలు నిర్వహించడం హాట్ టాపిక్ అయ్యాయి.

## తెలంగాణలో బీసీ కులగణనకు ప్రత్యేక కమిషన్

**(1వపేజీ తరువాయి)** తెలంగాణలో బీసీ కులగణనకు ప్రత్యేక కమిషన్
రేవంత్ అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన రేపటి(సోమవారం)లోగా ఉత్త ర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశిం చారు. ఇలాంటి కీలకమైన అంశాల్లో ప్రభుత్వా నికి ఎలాంటి బేషజాలు ఉండవని, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలోనూ పారదర్శ కంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ అధికారులకు చెప్పారు.

**నవంబర్ 6 నుంచి కులగణన**

దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టనున్నారు. తెలంగాణలో నవంబర్ 6 నుంచి కులగణన ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరుకా నున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు.
కాగా, కుల గణనలో.. మీ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా రాజకీయ పదవులు పొందారా?, ప్రజా ప్రతినిధిగా ఎన్నికయ్యారా?, మీకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా?, ఎలా ఉపాధి పొందుతున్నారు?, భూమి ఉందా?, ఏడాదికి కుటుంబ ఆదాయం ఎంత వస్తుంది? ఈ వివరాలన్నీ సేకరించే అవకాశం ఉంది. ఈ మేరకు ఒక్కో కుటుంబంలోని సభ్యుల సమాచార సేకరణకు మొత్తం 60 ప్రశ్నలను తయారు చేశారు. వీటిలో సగం కుటుంబం నేపథ్యంపైనే ఉండగా, మిగిలినవి వ్యక్తిగత? వివరాలకు సంబంధించినవి ఉంటాయి. ఈ ప్రశ్నల్లో ఏవి అవసరం అనేది రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించాల్సి ఉంది.

## తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం

**(1వపేజీ తరువాయి)**శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈసారి వరి ధాన్యం 150 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యిందని తెలిపారు. ప్రోత్సాహకంగా సన్న వరిధాన్యం పండించిన రైతులకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల రూపాయలు ఉచిత వైద్యం, రూ. 18 వేల కోట్లతో రుణమాఫీ, అన్ని సౌకర్యాలతో ఆధునాతన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు రూపొందిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.భారతదేశంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని తెలిపారు. సర్వే నెంబర్ 57లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను రూ. 200 కోట్లతో నిర్మించుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఈ స్కూల్‌లో 4 నుంచి 12వ తరగతి వరకు క్లాసులు జరుగుతాయన్నారు.
గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామానికి వచ్చినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్నవారు కాంగ్రెస్ సభ్యులు కారు.. వీరంతా తమ కుటుంబసభ్యులని అన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఇంత మెజార్టీ ఇచ్చినందుకు ప్రజలకు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు. కాగా, రేషన్ షాపుల్లో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## అప్పుల్లో టాప్ ఏపీ!

**(1వపేజీ తరువాయి)**ఉన్నాయి. ఈ క్రమంలో... దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే అప్పులున్న వారిలో దక్షిణాది రష్ట్రాలు తొలి ఐదు స్థానాల్లోనూ ఉండగా.. వాటిలో తొలి రెండు స్థానాల్లోనూ తెలుగు రాష్ట్రాలే నిలవడం గమనార్హం. వీటిలో ఏపీ ఫస్ట్ ప్లేస్ లో ఉండగా.. తెలంగాణ సెకండ్ ప్లేస్ లో ఉంది. ఇదే క్రమంలో... దేశంలో అత్యల్పంగా గోవాలో ప్రతీ లక్ష మంది జనాభాకు 2,317 మందికి మాత్రమే అప్పులు ఉండగా.. రాజధాని ఢిల్లీలో 8,249 మందికి, బీహార్ లో 9,899 మందికి, యూపీలో 11,844.. పంజాబ్ లో 11,941.. మహారాష్ట్రలో 12,258, రాజస్థాన్ లో 13,480.. ఒడిశాలో 19,956 మందికి అప్పులున్నాయని తాజా సర్వే తేల్చింది.

## టీడీపీలోకి వాసిరెడ్డి పద్మ?

**(1వపేజీ తరువాయి)**ప్రభుత్వాన్ని నడపడంలో జగన్ ఫెయిల్ అన్నట్లుగా ఆమె మాట్లాడారు. మరో వైపు చూస్తే వాసిరెడ్డి పద్మ మంచి సబ్జెక్ట్‌తో మాట్లాడే మాటలు ప్రత్యర్థులకు గుక్క తిప్పుకోలేనివే. అందువల్ల ఆమె ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీని బాగా కాసుకుంటారు అన్న మాట ఉంది. ఆమె వైసీపీలో ఉన్నపుడు టీడీపీ జనసేన మీద పదునైన విమర్శలు చేశారు. దాంతో ఆమె ఈ రెండు పార్టీలలో దేనిలో చేరుతారు అన్న చర్చ నడచింది. అంతే కాదు ఆమె కాంగ్రెస్ వైపు వెళ్తారు అని కూడా మరో వైపు ప్రచారం సాగింది. అయితే లేటెస్ట్ గా ఆమె మీడియాతో మాట్లాడుతూ తనకు అన్ని పార్టీలలోనూ ఆప్తులు ఉన్నారని చెప్పడం విశేషం. అంటే తనకు అన్ని పార్టీల నుంచి ఇన్విటేషన్లు ఉన్నాయని ఆమె చెప్పకనే చెప్పారు అన్న మాట. అదే సమయంలో ఆమె విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని చిన్ని తనకు ఎంతో ఆప్తులు అని అన్నారు. దీనిని బట్టి చూస్తే ఆమె చేరబోయే పార్టీ గురించి హింట్ ఇచ్చేశారా అన్న చర్చ అయితే సాగుతోంది. టీడీపీ వైపుగా ఆమె అడుగులు పడుతున్నాయని అంటున్నారు. టీడీపీలో అయితే ఎంతో మంది నేతలు ఉన్నారు. అయినా కొత్తగా వచ్చేవారికి అక్కడ లోటు ఉండదు, ఆ పార్టీ ఒక పుష్పక విమానంగా ఉంటుంది. దాంతో వాసిరెడ్డి పద్మ టీడీపీలో చేరబోతున్నారు అని ప్రచారం సాగుతోంది. ఆమె వైసీపీలో ఉన్నపుడు చంద్రబాబుని ఎక్కడా స్పేర్ చేసేవారు కాదు, అంతే కాకుండా టీడీపీని గట్టిగా చీల్చి చెండాడిన నేతలలో ఆమె ముందు వరసలోనే ఉండేవారు. అయితే అదంతా ఆ పార్టీ ఫిలాసఫీలో భాగమే అని అంటారు. ఆమె టాలెంట్ ని ఆమె సబ్జెక్ట్ ని ఆమె ప్రత్యర్థులను టార్గెట్ చేసే తీరుని చూసి టీడీపీ ఆమెను చేర్చుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. వైసీపీలో దశాబ్ద కాలం పైగా ఉండి వచ్చిన పద్మకు ఆ పార్టీలోని గుట్లూ మట్లూ అన్నీ తెలుసు కాబట్టి ఆమెను ఈ వైపు నుంచి ప్రయోగించి వైసీపీని టార్గెట్ చేయాలని టీడీపీ భావిస్తే మాత్రం పద్మ తొందరగా పసుపు పార్టీ చెల్లెమ్మ అవుతారు అని అంటున్నారు. ఆమె టీడీపీకి ఒక బలమైన వాయిస్‌గా ఒక పదునైన ఆయుధంగా మారుతారు అని అంటున్నారు.

## ఏపీలో మరోసారి పలువురు ఐఏఎస్‌ల బదిలీ

**(1వపేజీ తరువాయి)**ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా మరికొంతమంది ఐపీఎస్‌లను ఏపీ ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## అలిగి వెళ్లిపోయిన నెల్లూరు ఎంపీ


**(1వపేజీ తరువాయి)**వెళ్లిపోయారు. వేమిరెడ్డి విషయంలో అధికారుల తీరును మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తప్పుబట్టారు. మరోసారి ఇలా జరగకూడదని కలెక్టర్, అధికారులను మంత్రి ఆదేశించారు.

## పొలిటికల్ రిటైర్మెంట్ ప్రకటించి షాకిచ్చిన టీడీపీ సీనియర్ నేత!

**అమరావతి-నవభూమిబ్యూరో**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడి పాలన సాగిస్తున్న వేళ ప్రస్తుతం స్పీకర్ గా కొనసాగుతున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక తన రాజకీయ జీవితం చాలని తన రాజకీయ జీవితానికి పూర్తిస్థాయిలో విరామం ప్రకటిస్తున్నట్లుగా ఆయన షాకింగ్ ప్రకటన చేశారు. 2029 ఎన్నికలలో తాను పోటీ చేయనని స్పష్టం చేశారు.
పదవులు శాశ్వతం కావన్న అయ్యన్న పాత్రుడు..తనకి కూడా వయసు పెరుగుతోందని తాను ఎంతో సుదీర్ఘమైన రాజకీయ జీవితాన్ని చూసానని అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. ఇక ఇదే సమయంలో పదవులు, అధికారాలు ఎవరికి శాశ్వతం కావని, ఆయన పార్టీ నేతలకు చెప్పారు. పార్టీలో పని చేసేవారు పదవీకాలంలో చేసిన మంచి పనులే వారిని చిరస్థాయిగా మంచి వారిగా గుర్తింపు తీసుకువస్తాయని ఆయన తెలిపారు.
2029 లోగా తాను రాష్ట్ర ప్రజలకు చేయాలనుకున్న మంచి పనులను చేసి తీరుతానని చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.ఇక ప్రజలకు సేవ చేసే విషయంలో ఒళ్ళు దాచుకునే ప్రసక్తే లేదని చెప్పిన ఆయన తనకు ఇంకా నర్సీపట్నం ఎమ్మెల్యేగా నాలుగేళ్ల ఎనిమిది నెలల పదవీకాలం ఉందని, ఈ పదవీకాలం తాను ప్రజా సంక్షేమం కోసమే పూర్తిస్థాయిలో వినియోగిస్తానని వెల్లడించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
సోమవారం
4 । నవంబర్ । 2024

## ఢిల్లీలో డేంజర్ బెల్స్.. రోజురోజుకు పడిపోతున్న వాయు




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశరాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత అంతకంతకూ పడిపోతున్నది. కాలుష్యం రోజురోజుకు పెరుగుతుండటంతో గాలి నాణ్యత పూర్తిగా క్షీణించిపోయింది. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు బురారీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 385 పాయింట్లుగా నమోదయింది. గాలి కాలుష్యానికి తోడు ఢిల్లీ అంతటా దట్టమైన పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషవాయువును పీల్చుకుంటున్న ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కాగా, దేశ రాజధానిలో దీపావళి రాత్రి అధిక స్థాయిలో వాయు కాలుష్యం నమోదైంది. పలు ప్రాంతాల్లో ఏక్యూఐ రీడింగ్‌లు గరిష్ఠ సాయి 999కి చేరాయి. ఏక్యూఐ 507 పాయింట్లకు చేరితే ప్రమాదకర స్థాయి కాలుష్యంగా పరిగణిస్తారు. ఈ గాలి పీల్చితే ప్రజలకు శ్వాసకోశ సమస్యలు వస్తాయని నిపుణులు



చెబుతున్నారు.
ఆగ్రా, నోయిడాతోపాటు ఢిల్లీ ఎన్సీఆర్‌లో దట్టంగా పొగ కమ్ముకున్నది. కాలుష్యం ధాటికి తాజ్‌మహల్ కనిపించకుండా పోయింది. గత 10 నుంచి 12 రోజుల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయిందని దీపక్‌కుమార్ అనే స్థానికుడు వెల్లడించారు. ఇక యమునా నది నురగలు కక్కుతున్నది. పెద్దమొత్తంలో నురగ నదిపై ప్రవహిస్తున్నది.

## సినీ నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపీపై కేసు.. రూల్స్ అతిక్రమించారణని ఆరోపణలు..!




**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర సహాయ మంత్రి, ప్రముఖ సినీ నటుడు సురేశ్ గోపీపై కేసు నమోదైంది. ట్రాఫిక్ ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో పాటు అబులెన్స్‌ని దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై కేరళ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న త్రిస్సూర్‌పురంలోని స్వరాజ్ మైదానానికి ఆయన అంబులెన్స్‌లో చేరుకున్నారు. వన్ వే రోడ్డులో ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించేందుకు వినియోగించే అంబులెన్స్‌లో ప్రయాణించడం వివాదాస్పదంగా మారింది. అయితే, ఆ సమయంలో ఆయన అనారోగ్య సమస్యలతోనే అంబులెన్స్‌లో వచ్చినట్లుగా వివరణ ఇచ్చారు.కాలు నొప్పి ఉందని.. దాంతో జనాల్లో నడవలేనంటే రాజకీయ ప్రయోజనాలు లేని కొందరు యువజనులు తనకు అంబులెన్స్‌లో సమకూర్చారని చెప్పారు. కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన నేత ఫిర్యాదు మేరకు సురేశ్ గోపీపై కేసు నమోదైంది. బీఎన్ఎస్ 279, 34 సెక్షన్లు, మోటారు వాహనాల చట్టం కింద 179, 184, 188, 192 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సురేశ్ గోపీ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. మలయాళ చిత్ర పరిశ్రమలో స్టార్ హీరో. ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేసి బీజేపీ తరఫున పోటీ చేసి లోక్‌సభకు ఎన్నికైన నేత తొలినేత ఆయనే. ప్రస్తుతం ఆయన మోదీ ప్రభుత్వంలో పెట్రోలియం శాఖ సహాయమంత్రిగా పని చేస్తున్నారు.

## చెరువులోకి దూసుకెళ్లిన కారు.. ఎనిమిది మంది దుర్మరణం




**న్యూఢిల్లీ- నవభూమి:** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. బలరాంపూర్ జిల్లాలో అదుపు తప్పి కారు చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది ప్రాణాలు కోల్పోయారు. శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. సంఘటనా స్థలంలోనే పలువురు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. రాజ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుధా బాగీచా ప్రధాన రహదారిపై ఓ మలుపు వద్ద ఎస్‌యూవీ వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే చెరువులోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో ఆరుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్‌తో పాటు మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతులు లారిమా నుంచి పొరుగునే ఉన్న సూరజ్‌పూర్ జిల్లాకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అయితే, వాహనం వేగంగా వెళ్లడంతోనే నియంత్రణ కోల్పోయి చెరువులోకి దూసుకెళ్లినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని క్రేన్ సహాయం బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో డ్రైవర్ సహా ఎనిమిది మంది ఉన్నారని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఓ మహిళ, మరో చిన్నారి ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## శ్రీనగర్ మార్కెట్‌లో గ్రెనేడ్ పేలుడు.. 12 మందికి గాయాలు




**న్యూఢిల్లీ- నవభూమి:** సెంట్రల్ కశ్మీర్ శ్రీనగర్ జిల్లా ఆదివారం మార్కెట్‌లో గ్రెనేడ్ పేలుడు కలకలం సృష్టించింది. ఈ ఘటనలో 12 మంది వరకు గాయపడ్డారు. సీనియర్ పోలీసు అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. టీఆర్‌సీ సమీపంలో రద్దీగా ఉండే మార్కెట్‌లో ఉగ్రవాదులు గ్రెనేడ్ విసిరారు. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నది. అందరూ చిన్న గాయాలు మాత్రమే అయ్యాయని.. ఎవరికీ ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. దాడి సంఘటన జరిగిన వెంటనే, ఉగ్రవాదులను పట్టుకునేందుకు భద్రతా దళాలు మొత్తం ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. దాడికి సంబంధించి మరింత సమాచారం సేకరించేందుకు దర్యాప్తు ప్రారంభించారు. అయితే, ప్రాథమిక సమాచారం ప్రకారం క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పోలీసులు వేగంగా స్పందించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## 10 రోజుల్లో రాజీనామా చేయ్.. లేదంటే చంపేస్తాం.. యూపీ సీఎంకు బెదిరింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌ను చంపేస్తామంటూ ముంబై పోలీసులకు బెదిరింపు సందేశం వచ్చింది. పది రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని లేదంటే బాబా సిద్ధిఖీలాగా చంపుతామని దుండగులు అందులో హెచ్చరించారు. శనివారం సాయంత్రం ముంబైలోని ట్రాఫిక్ కంట్రోల్ సెల్‌కు ఒక నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో సమాచారాన్ని యూపీ పోలీసులకు చేరవేశారు. మెసేజ్ పంపిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.
గత నెలలో మహారాష్ట్ర ఎన్సీపీ పవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కాల్చి చంపిన విషయం తెలిసిందే. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్‌తో సన్నిహితంగా ఉన్నందుకే చంపామని తెలిపారు. సిద్ధిఖీ కుమారుడు జీశాన్, సల్మాన్ ఖాన్‌కు కూడా బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముస్తఫా అనే వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

# ప్రముఖ దర్శకుడు తన ఇంట్లోనే ఆత్మహత్య



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రముఖ కన్నడ దర్శకుడు, రంగనాయకఫేం గురు ప్రసాద్ ఆదివారం ఉదయం తన బెంగళూరు అపార్ట్‌మెంట్‌లో మరణించినట్లు గుర్తించారు. అతడి వయసు 52. రెండు లేదా మూడు రోజుల ముందు ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఉత్తర బెంగళూరులోని మదనా యకనహళ్లి ప్రాంతంలో గత ఎనిమిది నెలలుగా నివసి స్తున్న ఆయన ఫ్లాట్ నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు ఈ విషయాన్ని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసారు. మీడియా కథనాల ప్రకారం.. గురు ప్రసాద్ తన తాజా చిత్రం రంగనా యక బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలవ్వడంతో ఆర్థికంగా ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. పెరిగిన అప్పులతో సమస్యల్ని ఎదుర్కొంటున్నాడు. అతడి కష్టాలు డిప్రెషన్‌లోకి నెట్టాయి. మాట (2006), ఎద్దెలు మంజునాథ (2009) సహా పలు విమర్శనాత్మక చిత్రాలకు దర్శకత్వం వహించారు గురు ప్రసాద్. కన్నడ రియాల్టీ షోలలో న్యాయనిర్ణేతగా కూడా కనిపించారు. మొదటి భార్య నుంచి విడాకులు తీసుకోవడంతో ఇటీవల మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. గురుప్ర సాద్ తన వ్యంగ్య శైలి , సామాజిక సంబం ధిత ఇతివృత్తాలతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకు న్నారు. 0-3తో క్లీన్ స్వీప్.. డబ్ల్యూటీసీ ఫైనల్ నుంచి భారత్ ఔట్.. అతడి తొలి చిత్రం మాట (2006).. ఆ సినిమా స్క్రీన్ ప్లే కి గొప్ప ప్రశంసలు దక్కాయి. అతడు ఆ తర్వాత ఎద్దెలు మంజునాథ (2009) అనే డార్క్ కామెడీని రూపొందించాడు. అది అతని అత్యంత ప్రసిద్ధ రచనలలో ఒకటిగా మారింది. ఉత్తమ స్క్రీన్ ప్లే విభాగంలో కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర అవార్డును గెలుచుకుంది. ఈ చిత్రం దిగువ-మధ్యతరగతి నేపథ్యంలో ఉదాసీనత, పోరాటాల నేపథ్యంలో తెరకెక్కింది. జీవితాన్ని పచ్చిగా, వాస్తవికంగా తెరపై చిత్రీకరించినందుకు గొప్ప ప్రజాదరణ పొందింది. 2013లో అతడు డైరెక్టర్స్ స్పెషల్, వ్యంగ్యపు కథనంతో మరొక సినిమాని విడుదల చేశాడు. ఇది చలనచిత్ర పరిశ్రమపై విమర్శలతో అందరి దృష్టిని ఆకర్షించింది. అతడి తదుపరి చిత్రం ఎరడనే సాలా (2017) సంక్లిష్టమైన ప్రేమకథతో రూపొందింది. గురుప్రసాద్ తెరకెక్కించిన ఇటీవలి చిత్రం %-%రంగనాయక%-% 2024లో విడుదలైంది. దురదృష్టవశాత్తూ బాక్సాఫీస్ వద్ద పేలవంగా ఆడింది. ఇది అతడి ఆర్థిక ఇబ్బందులను పెంచింది.

## కెనడా పొగరుకు పెద్ద మందు వేయాల్సిందే



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇలాంటప్పుడు ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ మరింత దూకుడు ప్రదర్శించాల్సిన అవసరం ఉంది కదా? అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న ధోరణి సరికాదన్న భావన వ్యక్తమవుతోంది. తమ దేశ భద్రతకు.. సార్వభౌమాధికారానికి.. దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లితే ఎదుటోడు ఎవడన్న విషయాన్ని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారి విషయంలో ఒక్క అమెరికానే కాదు.. ప్రపంచంలోని చాలా దేశాలు అస్సలు ఉపేక్షించవు. చివరకు చిన్న దేశాలు సైతం ఎగిరెగిరి పడుతుంటాయి.

ఇలాంటప్పుడు ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ మరింత దూకుడు ప్రదర్శించాల్సిన అవసరం ఉంది కదా? అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న ధోరణి సరికాదన్న భావన వ్యక్తమవుతోంది. తప్పు చేయకున్నా.. తప్పు చేసినట్లుగా బిల్డప్ లు ఉన్న కెనడాకు ముకుతాడు వేయాల్సిన అవసరం ఉంది. అసలు భారత్ ను ముక్కలు చేయాలన్న నినాదంతో ఉండే సంస్థల విషయంలో కెనడా ఎందుకు చర్యలు తీసుకోదు? ఇలాంటి తీరును ముందు ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. భారత సార్వభౌమాధికారానికి సవాలుగా మారుతున్న ఇలాంటి శక్తుల విషయంలో దూకుడుగా ఎందుకు వ్యవహరించకూడదు? ఇప్పటికే ఖలిస్థానీ సానుభూతిపరులకు పెద్దపీట వేస్తున్న కెనడా తీరును అంతర్జాతీయంగా ఎందుకు ప్రశ్నించకూడదు. ఇలాంటి శక్తులను ఎందుకు ఆదరించాలి? భారత్ పాత్ర లేకున్నా ఖలిస్థానీ నేత నిజ్జర్ ను ఎవరో హత్య చేస్తే దానని భారత్ ఖాతాలో వేయటం.. దౌత్య సిబ్బందిపై నేరారోపణ చేయటం.. వారిపై చర్యలు తీసుకునే షాకింగ్ చర్యలకు తెర తీయటం లాంటి పనులు చేపట్టిన కెనడా.. ఇటీవల దేశ హెూం మంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేయటం తెలిసిందే.్య కెనడా మంత్రి ఒకరు కేంద్ర మంత్రి అమిత్ షాపై అసంబద్ధ ఆరోపణలు చేసిన నేపథ్యంలో దానిని భారత్ తీవ్రంగా ఖండించటమే కాదు.. కెనడా హైకమిషనర్ ప్రతినిధిని పిలిపించి తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. కెనడా అధికారికి సమన్లు జారీ చేశారు. అయితే.. ఈ చర్యలు కెనడా లాంటి మొద్దు శరీరం ఉన్న ట్రూడో ప్రభుత్వాన్ని కదిలిస్తుందా? అన్నది ప్రశ్న. ఒక ప్రజాస్వామ్య దేశానికి చెందిన హెూం మంత్రి మీద తీవ్ర ఆరోపణలు చేసే వేళ.. ఆధారాల్లేకుండా మాట్లాడటానికి మించిన దుర్మార్గం ఏముంటుంది? ఇప్పటికే పలుమార్లు లక్ష్మణ రేఖ దాటుతున్న కెనడాకు ముకుతాడు వేయాల్సింది. గతంలో మాదిరి కాదని.. ఏమన్నా చూస్తూ ఊరుకునే ధోరణి భారత్ కు లేదన్న విషయంతో పాటు.. దేశ ప్రయోజనాల్ని దెబ్బ తీసే ఎలాంటి చర్యలకైనా ఖరీదైన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్న విషయాన్ని కెనడాకుఅర్థమయ్యేలా చెప్పటం చాలా అవసరమని చెప్పాలి. మరి.. మోడీ సర్కారు ఎలా వ్యవహరిస్తుందో చూడాలి.

## హారిస్ గెలుపు కోసం.. తులసేంద్రపురంలో పూజలు





చెన్నై: **నవభూమి:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిని కమలా హారిస్ కోసం తమిళనాడులోని తులసేంద్రపురం గ్రామస్థులు పూజలు చేస్తున్నారు. దేవాలయం వద్ద “కమల ఈ గ్రామానికి చెందిన గొప్ప బిడ్డ” అంటూ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఆమె తాత పీవీ గోపాలన్ ఈ గ్రామంలోనే జన్మించారు. ఆమె తల్లి శ్యామల గోపాలన్ 19 ఏళ్ల వయసులో వైద్య విద్యను అభ్యసించేందుకు అమెరికాకు వెళ్లారు. అక్కడే కమల, ఆమె సోదరి మాయ జన్మించారు. తులసేంద్రపురం గ్రామస్థుడు ఒకరు మాట్లాడుతూ.. కమల హారిస్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం గొప్ప చరిత్ర అని చెప్పారు. ఆమె గెలుపోటములతో తమకు సంబంధం లేదని, ఆమె పోటీ చేయడమే తమకు గర్వకారణమని తెలిపారు.

## హారీస్ గెలిస్తే భారత్‌కు మేలు



**వాషింగ్టన్-నవభూమి:** ఇంకో మూడే రోజులు. అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరగబోతోంది. దాదాపుగా 35 కోట్ల మంది అమెరికన్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.
మరో నాలుగు సంవత్సరాల పదవి కోసం కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు.
పోలింగ్ గడువు సమీపించిన నేపథ్యంలో ఎన్నికల ప్రచార వేడిగా పతాక స్థాయికి చేరింది. ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లతో అక్కడి రాష్ట్రాలు హెూరెత్తిపోతున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి డెమొక్రాట్లు, ఈ దఫా ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలతో రిపబ్లికన్లు పోరాడుతున్నారు.
ఈ ఎన్నికల్లో డెమొక్రాట్ల తరఫున ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బరిలో దిగిన విషయం తెలిసిందే. ట్రంప్ వరుసగా మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోన్నారు. 2016 నాటి ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఆయన ఆ తరువాతి ఎన్నికల్లో ఓడిపోయారు. మూడోసారి బరిలో నిలిచారు.
నార్త్ కరోలినా, ఆస్టిన్, టెక్సాస్, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ వంటి రాష్ట్రాల్లో డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ ఇప్పటికే ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నారు. ముమ్మర ప్రచారాన్ని సాగిస్తోన్నారు.
నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఉద్యోగ అవకాశాలు తగ్గుముఖం పట్టడం, అక్రమ వలసదారులు.. వంటి అంశాల ఈ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపున్నాయి. అలాగే అబార్షన్ కూడా. 24 వారాల తరువాత అబార్షన్ చేయడాన్ని భ్రూణహత్యతో సమానంగా పరిగణిస్తారు రిపబ్లికన్ పార్టీ. దీన్ని వ్యతిరేకించే మహిళలు డెమొక్రాట్లకు మద్దతు ఇస్తోన్నారు.
ఈ పరిణామాలపై యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు, భారత సంతతికి చెందిన రాజా కృష్ణమూర్తి స్పందించారు. ఈ ఎన్నికల్లో గెలిచేదెవరనేది అంచనా వేశారు. డొనాల్డ్ ట్రంప్- కమలా హ్యారిస్ మధ్య పోటీ తీవ్రంగా ఉందని, హెూరాహెూరీ పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచేది మాత్రం కమలా హ్యారిసేనని అన్నారు.
ఏఎన్ఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రాజా కృష్ణమూర్తి మాట్లాడారు. కమలా హ్యారిస్.. అమెరికాకు మొట్టమొదటి దేశీ ప్రెసిడెంట్ కాబోతోన్నారని జోస్యం చెప్పారు. ఆమె సారథ్యంలో భారత్- అమెరికా మధ్య గల దౌత్య, ఆర్థిక, సాంస్కృతి సంబంధాలు మరింత బలోపేతమౌతాయనడంలో సందేహాలు అక్కర్లేదని అన్నారు.
ఆరు నుంచి ఏడు రాష్ట్రాల ఓటర్లు ఈ ఎన్నికలను మలుపు తిప్పగలుగుతారని రాజా కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. 2020లో ఓట్ల లెక్కింపు సమయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్న విషయన్ని గుర్తు చేశారు. హెూరాహెూరి పోరు నెలకొన్నందున ఓటర్ల తీర్పుపై స్పష్టత రావాలంటే మనం ఓపిక పట్టాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.
డొనాల్డ్ ట్రంప్ విజయం సాధిస్తే- అమెరికా అనుసరిస్తోన్న ప్రస్తుత విదేశీ విధానాల్లో భారీ మార్పులు రావొచ్చని అంచనావేశారు. అలాగే వాణిజ్యం, మార్కెటింగ్ వంటి కీలక రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాలు చోటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కమలా హారిస్ విజయం సాధించితే భారత్‌కు లబ్ది కలుగుతుందని, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమౌతాయని అన్నారు.
ఆసియాలో భారత్‌ను చైనాకు ధీటుగా అభివృద్ధి చెందే అవకాశం లభించగలదని రాజా కృష్ణమూర్తి చెప్పారు. ఈ ఎన్నికల్లో అమెరికాలో నివసించే భారతీయ ఓటర్లు ప్రభావం చూపుతారని అన్నారు. అభ్యర్థుల విషయంలో వారి మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ- భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం చేసే వారికే పట్టంగడతారని పేర్కొన్నారు.

## శబరిమల అయ్యప్ప భక్తులకు ఉచిత బీమా ఈ ఏడాది వరకు మాత్రమే



**కొట్టాయం- నవభూమి:** శబరిమల అయ్యప్ప స్వామి భక్తులకు ఉచిత బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు కేరళ దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ శనివారం చెప్పారు. ఈ నెలాఖరు నుంచి ప్రారంభమయ్యే మండలం-మకరవిళక్కు సీజన్‌లో శబరిమలను సందర్శించే భక్తులకు రూ.5 లక్షల ఉచిత బీమా సదుపాయం వర్తిస్తుందన్నారు. ఈ దేవాలయం నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించే ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ఈ ఏడాది శబరిమలకు వచ్చే భక్తులందరికీ బీమా కవరేజ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

## ఎన్‌కౌంటర్లలో ముగ్గురు ఉగ్రవాదుల హతం.. మృతుల్లో లష్కరే తాయిబా టాప్ కమాండర్




**న్యూఢిల్లీ- నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లో శనివారం రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయి. అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. మరణించిన ఉగ్రవాదుల్లో విదేశీయుడొకరు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదిని లష్కరే తాయిబా టాప్ కమాండర్ ఉస్మాన్‌గా గుర్తించినట్టు కశ్మీర్ జోన్ ఐజీపీ విద్ది కుమార్ బర్డీ తెలిపారు. 2023లో జరిగిన ఇన్‌స్పెక్టర్ మస్రూర్ హత్య కేసుతో అతడికి సంబంధం ఉందని చెప్పారు. కాగా, శ్రీనగర్ సమీపంలోని ఖన్యర్ ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

## ఉచిత పథకాలు ప్రమాదకరం.. ఫ్రీ బస్సుతో వృథా ప్రయాణాలు చేస్తున్న మహిళలు: కాంగ్రెస్ ఎమ్మెల్యే



**బెంగళూరు-నవభూమి:** కర్ణాటక కాంగ్రెస్‌లో గ్యారెంటీలపై లొల్లి చల్లారలేదు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని సమీక్షిస్తామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ఆర్వీ దేశ్‌పాండే మద్దతు తెలిపారు. శుక్రవారం దేశ్‌పాండే మీడియాతో మాట్లాడుతూ.. ‘డీకే శివకుమార్ మంచి ఉద్దేశంతోనే చెప్పారు. గ్యారెంటీ పథకాల కోసం ఏటా రూ.65 వేల కోట్లు అవసరం. కొన్ని మంచి పథకాలు ఉన్నాయి. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఈ పథకా లను దుర్వినియోగం చేస్తున్నారు. ఉదాహరణకు శక్తి పథకం వల్ల కొందరు మహిళలు పదేపదే వెళ్లిన ప్రాంతాలకే మళ్లీ ప్రయాణిస్తున్నారు. ఉచితంగా ఇవ్వడం ఎంత మంచిదో అంత ప్రమాదకరం. మనకు పారదర్శకత ఉండాలి. అర్హులైన మేరకే ప్రమోజనాలు అందాలి. ఈ దిశగా ఆదేశాలు తప్పు కాదు.’ అంటూ వ్యాఖ్యా నించారు. కాగా, డీకే శివకుమార్ వ్యాఖ్యలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యతిరేకించినప్పటికీ దేశ్‌పాండే ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

**ఉచిత బస్సు ప్రయాణ దూరంపై పరిమితి?**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే శక్తి పథకాన్ని సమీక్షిస్తామని డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై వివాదం రేగినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటికే ఈ పథకాన్ని సమీక్షిస్తున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా మహిళలు ఉచితంగా ప్రయాణించే దూరంపై పరిమితి విధించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే, రోజువారీగా లేదా నెలవారీగా ఈ పరిమితి విధించాలా అనేది ఆలోచిస్తున్నట్టు చెప్తున్నారు. ఇందుకోసం ముందుగా మహిళలకు స్మార్ట్ కార్డులు జారీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం.

## శ్రీనగర్ ఎన్ కౌంటర్ లో లష్కరే కమాండర్ హతం..!



శ్రీనగర్-నవభూమి: జమ్ము కశ్మీర్‌లోని శ్రీనగర్ నగర పరిధిలోని ఖన్యార్ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తాయిబా కమాండర్ మరణించాడని కశ్మీర్ జోన్ ఐజీపీ విద్ది కుమార్ బర్దీ తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన లష్కరే తాయిబా కమాండర్‌కు 2023లో జరిగిన ఇన్‌స్పెక్టర్ మస్రూర్ హత్య కేసుతో సంబంధం ఉందని ఐజీపీ బర్దీ చెప్పారు. శనివారం ఉదయం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు భద్రతా జవాన్లు గాయ పడ్డారని వెల్లడించారు.'ఇప్పుడు ఆపరేషన్ పూర్తయింది. భద్రతా దళాల కాల్పుల్లో మరణించిన ఉగ్రవాది పేరు ఉస్మాన్ అని, ఆయన లష్కరే తాయిబా కమాండర్. ఆయన విదేశీ ఉగ్రవాది. ఇన్‌స్పెక్టర్ మస్రూర్ హత్యతో ఆయనకు సంబంధం ఉంది' అని ఐజీపీ బర్దీ తెలిపారు. అనంత నాగ్ ఎన్ కౌంటర్ మీద ఆయన స్పందిస్తూ.. 'మాకు అందిన ఇన్ పుట్స్ మేరకు సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించాం. ఈ ఆపరేషన్ లో ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు జరిగిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు' అని తెలిపారు.

## న్యాయ నిర్ణయాలలో ఆ స్వతంత్రత ఏదీ?

అయోధ్యలో బాబ్రీ మసీదు తాళాలు తెరిచి, రామ్ లల్లా విగ్రహాన్ని భక్తుల సందర్శనానికి వీలు కల్పించేలా 1986లో ఫైజాబాద్ జిల్లా మెజిస్ట్రేట్ కెఎం పాండే ఆదేశాలు జారీ చేశారు. 'ఆ రోజు విచారణ జరుగుతున్నంత సేపు ఒక నల్లటి కోతి కోర్టు గది కప్పుపై కూర్చుని ఉండేది. తుది తీర్పు వినేందుకు వచ్చిన వేలాది ప్రజలు ఆ కోతికి పళ్లు, ఇతర ఆహార పదార్థాలు ఇచ్చినప్పటికీ అది ఏ మాత్రం వాటిని ముట్టుకునేది కాదు. చివరకు మసీదు తాళాలు తెరవాలని సాయంత్రం 4.40 గంటలకు తీర్పు ఇచ్చిన వెంటనే ఆ కోతి అక్కడి నుంచి మాయమైపోయింది. తీర్పు ఇచ్చిన తర్వాత నేను అక్కడి నుంచి బంగళాకు చేరుకునే సరికే ఆ కోతి ఆశ్చర్యకరంగా వరండాలో కనిపించింది. ఇది దైవిక శక్తి కాకపోతే మరేమిటి?' అని పాండే తన ఆత్మకథ 'వాయిస్ ఆఫ్ కాన్సియస్' (అంతరాత్మ స్వరం)లో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కూడా అన్నీ దైవ సంకల్పితాలని నమ్మేవారిలో ఒకరు. అయోధ్యలో వివాదాస్పద భూమిని రామమందిర నిర్మాణానికి అప్పగించి, మసీదుకోసం వేరే స్థలం కేటాయించాలన్న సుప్రీంకోర్టు తుది తీర్పు కూడా దైవ ఘటనే అని ఆయన విశ్వసించారు! అయోధ్య సమస్యకు పరిష్కారం చూపాలని తాను ఇంట్లో దేవుడి విగ్రహం ముందు కూర్చుని ప్రార్థించానని జస్టిస్ చంద్రచూడ్ కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో ఒక సమావేశంలో వెల్లడించారు. భారతదేశంలో విశ్వాసాల విషయంలో ఒక జిల్లా మెజిస్ట్రేట్‌కూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ పెద్ద తేడా లేదని ఈ ఉదంతాలు నిరూపిస్తాయి.ఎవరు అవునన్నా, కాదన్నా, రాజ్యాంగం, రూల్ ఆఫ్ లా, చట్టాలతో పాటు మన దేశంలో మనిషి భక్తి విశ్వాసాలు, నమ్మకాలు కూడా కీలకమైన పదవుల్లో ఉన్న వారి నిర్ణయాలను ప్రభావితం చేయకతప్పదు. చాలా అరుదైన వ్యక్తులు మాత్రమే తమ వ్యక్తిగత విశ్వాసాలను, నమ్మకాలను పక్కన పెట్టి తాము తీసుకున్న నిర్ణయాలు ఈ రాజ్యాంగం ప్రకారం, దేశ చట్టాల ప్రకారం సరైనవా కాదా అని మాత్రమే చూస్తారు. వచ్చే వారం పదవీవిరమణ చేయనున్న జస్టిస్ చంద్రచూడ్ రెండేళ్ల పనితీరును అంచనా వేయాలంటే ఆయన ఈ రెండేళ్లలో ఇచ్చిన తీర్పులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన వ్యవహరించిన తీరును పరిశీలించాల్సి ఉంటుంది. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో మాకు మా విధుల గురించి బాగా తెలుసు. రాజకీయ కార్యనిర్వాహక వర్గానికీ వారి విధుల గురించి తెలుసు. ఏ న్యాయమూర్తీ న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ముప్పు రానివ్వరు.' అని జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల ముంబైలో లోక్‌సత్తా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ అన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన నివాసానికి వచ్చి పూజలు చేసిన విషయం వివాదాస్పదం కావడం గురించి మాట్లాడుతూ ఆయన ఈ వివరణ ఇచ్చారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే జస్టిస్ చంద్రచూడ్ ఈ వ్యాఖ్య ద్వారా ప్రభుత్వం తరఫున కూడా వివరణ ఇచ్చారు. న్యాయమూర్తి తనకు తన విధుల గురించి తెలుసని చెప్పుకోగలరు కాని ఇతరులకు కూడా తమ విధుల గురించి తెలుసని ఎలా చెప్పగలరు?రాజ్యాంగాన్ని సుప్రీంకోర్టు పరిరక్షిస్తుందని మన రాజ్యాంగవేత్తలు, న్యాయనిపుణులు భావిస్తారు. సుప్రీంకోర్టు తొలి దశకంలో (1950%-%60) కనియా, పతంజలి శాస్త్రి, మెహర్‌చంద్ మహాజన్, ముఖర్జీ, ఎస్ఆర్ దాస్ వంటి ప్రముఖుల నాయకత్వంలో రాజ్యాంగంలోని మూడు విభాగాల మధ్య ఖచ్చితమైన సమతుల్యం ఏర్పడేలా చూశారు. ఆ తర్వాతి దశకంలో (1960%-%70) నెహ్రూ మరణానంతరం ఏర్పడిన రాజకీయ అస్థిరత, ఆర్థిక అస్థిరత్వం అవినీతి పెచ్చరిల్లడం తదితర పరిస్థితుల్లో సుప్రీం తన భూమికను తాను నిర్వచించుకుంది. ఈ కొత్త మార్పుకు తెలుగువాడైన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కోకా సుబ్బారావు సారథ్యం వహించారు. గోలక్‌నాథ్ కేసు, ప్రీవీ పర్సు కేసు, బ్యాంకు జాతీయాకరణ కేసులపై చరిత్రాత్మక తీర్పులు ఇదే కాలంలో వచ్చాయి. రాజకీయ గుత్తాధిపత్యానికి ఈ తీర్పులు అడ్డుకట్ట వేసి ప్రాథమిక హక్కులకు పెద్దపీట వేశాయి. ఈ కేసులను చెల్లకుండా చేసేందుకు 1971 తర్వాత పార్లమెంట్ రాజ్యాంగ సవరణలు చేసింది. ఈ కాలంలో కూడా కోర్టులు ప్రభుత్వాన్ని ప్రతిఘటించాయి. కేశవానంద భారతి కేసులో ప్రాథమిక హక్కులతో పాటు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పు తర్వాత ఈ దేశంలో సర్వోన్నత న్యాయస్థానం అధికారాలను తగ్గించేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ కోర్టు తట్టుకుని నిలబడింది.

ఎమర్జెన్సీ అనంతరం 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 1978లో మనేకా గాంధీ కేసులో కోర్టు వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసింది. మినర్వా మిల్, వామనరావు కేసుల్లోనూ రాజ్యాంగంలోని మౌలిక స్వరూపానికి కోర్టు రక్షణలు కల్పించింది. 1980 తర్వాత కోర్టులు పేదలు, నిస్సహాయులు, అణగారిన వర్గాల తరఫున నిలబడేందుకు, ఖైదీల ప్రయోజనాలు కాపాడేందుకు, రూల్ ఆఫ్ లాను కాపాడేందుకు ప్రాధాన్యతనిచ్చాయి. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)కు ఇదే కాలంలో ప్రాచుర్యం లభించింది. భగవతి, కృష్ణయ్యర్, దేశాయి, చిన్నప్పరెడ్డి, జస్టిస్ థాకర్ లాంటి వారు ఒక టీమ్‌గా పనిచేసి సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని పెంచారు. 1990వ దశకంలో కూడా ఇందిరా సహానీ, ఎస్ఆర్ బొమ్మై, విశాఖ, సమతా, మోహినీ జైన్ తదితర కేసుల్లో కీలకమైన తీర్పులు వచ్చాయి. రిజర్వేషన్లు కల్పించడం, రాష్ట్రపతి పాలనను దుర్వినియోగం చేయడం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు అరికట్టడం, ఆదివాసీ ప్రాంతాలను మైనింగ్ దోపిడీ నుంచి పరిరక్షించడం, చదువుకునే హక్కును జీవించే హక్కుగా మార్చడం మొదలైన అంశాలపై అనేక కీలక తీర్పులు వెలువడ్డాయి.సంస్కరణల అనంతరం కోర్టు తీర్పుల స్వరూప, స్వభావాలు మారినప్పటికీ ప్రైవసీ, మానవ హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ వంటి అంశాలపై కీలకమైన తీర్పులు వెలువడ్డాయి. జస్టిస్ వెంకటాచలయ్య లాంటి ప్రధాన న్యాయమూర్తులు ప్రధానమంత్రులను సుప్రీంకోర్టుకు ఆమడ దూరంలో ఉంచారు. ఆయన తర్వాత జస్టిస్ జెఎస్ వర్మ, జస్టిస్ దీపక్ మిశ్రా వంటి వారు కీలకమైన తీర్పులను వెలువరించారు. మూక ఊచకోత లాంటి వాటిని తీవ్రంగా గర్హించడంతో పాటు స్త్రీలు, గే ల విషయంలో చెప్పుకోదగ్గ తీర్పులు ఇచ్చిన జస్టిస్ దీపక్ మిశ్రాను విలేఖరుల సమావేశంలో విమర్శించిన జస్టిస్ గొగోయ్ తర్వాతి కాలంలో వివాదాస్పదుడై పదవీ విరమణ అనంతరం రాజ్యసభ సభ్యత్వాన్ని పొందారు.నిజానికి తెలుగువాడైన జస్టిస్ రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీబాధ్యతలు చేపట్టే నాటికి ఆయనకు ముందున్న ముగ్గురు సిజెలు సుప్రీంకోర్టు ప్రమాణాలను తగ్గించారనే విమర్శలు ఉండేవి. ఆ ప్రమాణాలను నిలబెట్టడమే ఆయనకు తలకు మించిన పని అయింది.

### బీసీల కుల జనగణనతోనే బీసీల

# అభ్యున్నతి ముడిపడి ఉంది



మనదేశంలో ఏ కూటమి అధికారంలోకి వచ్చినా, ఎవరు పాలన అధ్యక్షుడిగా ఉన్న, దేశంలో ఎజెండాలు ఎగిరిన, ఆ జెండా లకు బీసీల ఓట్లు మాత్రమే కావాలి, ఆ జండా లకు జెండాలు మోసే బీసీకార్య కర్తలే కావాలి, ఊరిలో నైనా రాష్ట్రంలోనైనా, దేశంలో నైనా (రిజర్వేషన్లు తప్ప) తక్కువ జనాభా కలిగిన అగ్రకులాలనే అధికారం. దేశంలో ఓబీసీలం ఎంతమంది ఉన్నామే మాకు తెలియదు. అప్పుడెప్పుడో బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన బీసీల లెక్కలే ,ఈ దేశ బీసీలకు దిక్కు, ఎలక్షన్స్ వస్తే అన్ని పార్టీలు బిసిల ఓట్ల కోసం మేము బి సి కులజన గణన చేస్తాము అనిఅధికారంలోకి వస్తే. అని హామీలు ఇచ్చిన పార్టీలు ఎన్నో మరెన్నో, ఇక మేము ఎంత మంది మో ఈ దేశంలో మా మా ఓబిసి లెక్క తేలుతుంది. అనుకున్న తెల్లారే అధికారంలోకి వచ్చినాక ఆ మాట దాటి వేస్తున్నా పార్టీలు ఇప్పుడు కూడా అధికారం లోనే ఉన్నాయి. అయినా బీసీల లెక్కలు చెప్పడం లేదు.మొన్న ఎలక్షన్ లో బిజెపి పార్టీ కూడా ఈసారి అధికారంలోకి వస్తే బీసీల కుల జన గణన చేపడతామని అని అధికారంలోకి వచ్చిన పార్టీయె. కొన్ని రోజుల క్రితం రాజ్ నాథ్ సింగ్ మాత్రం బీసీలకు కుల జనగణన చేయాల్సి ఉందని కేంద్రానికిలేఖ రాసిన. కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఈ దేశ ఓ బి సి లు కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు ఉన్నారనే విషయం అందరికీ అర్థమవుతుంది. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కూడా తెలంగాణ రాష్ట్ర మరియు ఇతర రాష్ట్రాల ఎమ్.పిలు కూడా బీసీ కులాల జన గణన జరగాలని నినదించుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం మాత్రం బీసీలపై మొండి వైఖరి ప్రదర్శిస్తున్న చందంగా వ్యవహరించడం పట్ల ఈ దేశంలో ఉన్న ఓబీసీలపై కేంద్ర ప్రభుత్వం కారుస్తున్న మొసలి కన్నీళ్లు ఈ దేశ బీసీ ప్రజానీకం గమనిస్తున్న తరుణంలో అతి తొందరలో ఒక రైతు ఉద్యమం లాగా, బీసీ ఉద్యమం కూడా దేశ వ్యాప్త ఉద్యమం గా మారబోతుంది అని కొంతమంది సామాజిక కార్యకర్తలు మేధావులు ఇప్పటికే ప్రకటించారు. అసలు వెనుకబడిన తరగతుల ఉద్యమం ఎప్పుడు మొదలైందో తెలుసుకుంటే.

1857 ప్రథమ స్వాతంత్ర్య ఉద్యమం సిపాయిల తిరుగుబాటు కొంత కాలం తరువాత బ్రిటిష్ ప్రభుత్వం పరిపాలన రంగంలో లో కొన్ని ముఖ్యమైనటువంటి సంస్కరణలు తీసుకు వచ్చింది. వేగంగా కొన్ని మార్పులను కూడా చేపట్టింది.ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ అధికార యంత్రాంగంలో ఉద్యోగాల్లో అగ్రవర్ణాల అధికారుల ఆధిపత్యం ఉండేది. అంతే కాకుండా ఇంగ్లీష్ విద్యా వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో వారిదే అగ్ర చేయిగా ఉండేది.

అలాంటి పరిస్థితుల్లో బ్రాహ్మణేతర వర్గాలు, ముస్లిం వర్గాల్లో తీవ్ర అసంతృప్తి మొదలయింది. వివిధ రంగాల్లో తమ కూడా ప్రాతినిధ్యం కల్పించాలని, బ్రిటిష్ పరిపాలకుల పై ఒత్తిడి తేవడం మొదలయ్యింది, ఈ విషయానికి తోడు బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన 1851 లో జరిగిన జనాభా లెక్కల సేకరణ లో అనేక మైనటువంటి వెనుకబడిన తరగతుల్లో, మైనారిటీలో, ఉన్న అక్షరాస్యత, ఉద్యోగ వివరాలు, సామాజిక స్థితిగతులు, జీవన ప్రమాణ స్థాయి, మొదలైన వాటిని 1851 రిపోర్టు సవివరంగా వెల్లడించింది.మొట్టమొదటగా ముస్లింలు చైతన్యవంతమై 1909 చట్టం ద్వారా ప్రత్యేక నియోజకవర్గాలు సాధించుకున్నారు. దాని ఫలితంగా కొంతకాలానికి సిక్కులు, అణగారిన వర్గాలకు నిమ్న కులాల వారికి, క్రిస్టియన్లకు, విద్యా ఉద్యోగ రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ లు అయ్యాయి.

ముఖ్య కారకులు మహాత్మ జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి, శూద్ర కులాలకు అన్ని రంగాల్లో ప్రధాన పాత్ర వహించిన మహనీయులు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ రక్షణ కొరకు వెనకబడిన వర్గాల కోసం 1953 జనవరిలో కకా కలేల్కర్ కమిషన్ను అప్పటి ప్రభుత్వం నియమించింది ఇదే మొట్టమొదటి బ్యాక్వర్డ్ క్లాసెస్ కమిషన్ గా చెప్పుకోవచ్చు. 1955లో మార్చిలో ఈ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందించింది ఈ నివేదికలో దేశం మొత్తం మీద 2399 కులాలను వెనుకబడిన తరగతుల గుర్తించింది. అందులో 837 కులాలను బాగా వెనుకబడిన తరగతుల గా గుర్తించారు.వెనుకబడిన తరగతుల సర్వతో ముఖం అభివృద్ధికి అనేక రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని 1851లో చేసిన బీసీ కుల జనగణన సరిపోదని, 1961 లోపు కులాల వారిగా జనాభా లెక్కలు చేయవలెనని ముఖ్యంగా సూచించింది. అంతే కాకుండా మరికొన్ని సూచనలు కూడా ఆ కమిషన్ సూచించడం జరిగింది

అవి వయోజన విద్య, విశ్వవిద్యాలయాల,చదువు మొదలగు అనేక రంగాలలో వెనుకబడిన తరగతుల వారి కోసం సత్వర అభివృద్ధి పథకాలు చేపట్టాలని సూచించారు. స్త్రీలను అందరిని వెనుకబడిన తరగతుల గుర్తించాలని కూడా చెప్పారు. అయితే ఆ కమిషన్ చేసిన సిఫారసులను అమలు చేయకుండా ప్రభుత్వం చెప్పిన సాకులు ఏమిటంటే. మంది ఎక్కువయితే మజ్జిగ పలుచన అయినట్లు ఇంత మందికి సహాయం తల పెట్టడం వలన, నిజంగా సహాయం తీసుకోవాల్సిన వారికి, నష్టం జరుగుతుంది అని. ఈ విధానం రాజ్యాంగ 340 నిబంధనలోని షరతులకు విఘాతం కలిగిస్తుంది కనుక ఈ కమీషన్ నివేదికను,చేసిన సిఫారసులను లోపాలను సవరించాల్సిన ప్రభుత్వం ప్రకటించింది.ఈ కమిషన్ మీద 1956లో సెప్టెంబర్లో పార్లమెంటులో చర్చకు పెట్టిన ఏమీ కూడా చేయకపోగా రిజర్వేషన్లను వ్యతిరేకించారు, కులాల ఆధారంగా లెక్కలు జరగకూడదని వాదించారు,ఇంతేగా 1977లో జనతా పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే బీసీలకుకే.కే కమిషన్ నివేదికను ముఖ్యంగా బీసీ కుల జన గణన ను చేపడుతామని ప్రకటించి జనతా పార్టీ ఎన్నికల్లో గెలిచినప్పటికీ కే.కే కమిషన్ నివేదికను అమలు పరచలేదు, పోగా మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం మరో విధంగా స్పందించి కాక కాలేల్కర్ కమిషన్ తయారు చేసిన నివేదిక చాలా సంవత్సరాలు అయిపోయింది అప్పటినుంచి చాలా మార్పులు వచ్చాయనిమరొక కమిషన్ను నియమిస్తామని ప్రభుత్వం తెలిపింది. దాని ఫలితంగా బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిపి మండల్ ఆధ్వర్యంలో రెండవ బిసి కమిషన్ కేంద్ర ప్రభుత్వం నియమించింది .రెండవ కమిషన్ కూడా, 1980 డిసెంబర్ 31 వరకు కమిషన్ నివేదికను ప్రధాని ఇందిరాగాంధీకి సమర్పించింది. ఆ కమిషన్ నివేదికను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. 1988-1990 వరకు బహుజనసమాజ్ పార్టీ కూడా మండల నివేదిక అమలకు ఉద్యమించింది, ఢిల్లీలో బోట్స్ కబ్ల్ వద్ద కాన్సిరాం 48 రోజుల ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి ఎట్టకేలకు అప్పటి ప్రధానమంత్రి వి.పి సింగ్ 1990 ఆగస్టు 7న మండల్ నివేదిక అమల గురించి ప్రకటన చేశారు. దానితో దేశవ్యాప్తంగా ఉన్న అగ్ర కుల ఆధిపత్య కులాలు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టింది, దేశమంతా ఒక్కసారిగా అన్ని అగ్రకుల పార్టీ నాయకులు మండల నివేదికను అమలు వ్యతిరేకించారు..భారతదేశాన్ని వదిలి వెళ్లేటప్పుడు బ్రిటిష్ వార్ కడుపుమంటతో బాధపడ్డారు, దక్షిణాఫ్రికాలో తమ అణిచివేత ను నల్లవారు ప్రశ్నించినప్పుడు తెల్లవారు కడుపుమంట చూపారు. అదేవిధంగా 20 శాతంగా ఉన్న ఆధిపత్య కులాలు మిగిలిన ప్రజలను సామాజిక అన్యాయానికి గురి చేసినప్పుడు అణచి వేయబడ్డ కులాలు చాల బాధ పడ్డాయి,మండల్ కమిషన్ నివేదిక వ్యతిరేక వాదనలు చేసే వాదనలన్నీ ఉన్నత వర్గీయుల, అగ్రకులాల కడుపు మంటను చూపిస్తున్నాయి. ఇకనైనా మేల్కోండి ఈ దేశ బిసి ప్రజలారా.. ఒక అడవిలో ఎన్ని పులులు ఉన్నాయే. ఒక అడవిలో ఎన్ని కుందేళ్ళు ఉన్నాయో? ఎన్ని జాతీయ పక్షులు నెమళ్లు ఉన్నాయో? ఎన్ని విష సర్పాలు ఉన్నాయో? ఒక ఊరిలో ఎన్ని జంతువులు ? లెక్కలు చేసే ఈ కాలంలో ప్రభుత్వాలు బీసీ కుల జనగణన చేయకపోవడంతో ఆంతర్యం వారి పీఠలు పిక్క టిల్లుతాయే?. ఇకనైనా బిసిల ఓట్లు రూపంలో చూడకుండా, ఆయా పార్టీలు తమ చిత్తశుద్ధిని ప్రదర్శించి, బీసీ కుల జనగణనే ప్రధాన మానిఫెస్టో గా పెట్టుకొని ఆ దిశగా బిసి కుల జనగణన చేయాలని ఈ దేశ ఓబిసి ప్రజలందరూ. వారి వారి లెక్కల కొరకు ఆశిస్తున్నారు.

**మారోజు సోమా చారి**
**సామాజిక విశ్లేషకులు**

# ఇంగ్లీష్ వల్లనే జాతీయవాదం

భారత రాజ్యాంగ ప్రవేశికలో భారత్ అని పేర్కొన్న పదంలో అధిక భాగం శూద్రులకే వర్తిస్తుంది. వీరు జాతి రక్తమాంసాలుగా నిలిచారు. విద్యాహక్కుకు దూరమైనప్పటికీ బ్రిటిష్ వారితో పోరాటంలో ఆనాడు కీలక పాత్రను పోషించారు. శతాబ్దాలుగా విద్యకు దూరమైపోయిన శూద్ర, దళితులకు తక్కువ స్థాయిలో అయినా సరే ఇంగ్లిష్ విద్య అందిన నేపథ్యంలోనే జాతీయవాద భావన దేశంలో మోసులెత్తింది. కానీ నెహ్రూవియన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ద్వంద్వ విద్య (ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లిష్‌కు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాంతీయ భాషలకు పట్టం కట్టడం) వల్లే శూద్రుల విముక్తి మార్గం అనేక అడ్డంకులను ఎదుర్కొంది. ఇందువల్లే మన దేశంలోని ఉత్పాదక శక్తులు ఇప్పుడు జీవితంలోని అన్ని రంగాల్లోనూ అసమాన అస్తిత్వంతో కొట్టుమిట్టాడుతున్నాయి.ప్రస్తుత భారత జాతి భావన ప్రత్యేకించి 19వ శతాబ్దం మధ్యనుంచి మాత్రమే చైతన్య పూరితంగా నిర్మితమవుతూ వచ్చింది. కచ్చితంగానే అంతకు ముందు మనకు జాతిభావన లేదు. మనం నివసిస్తూ వచ్చిన ప్రస్తుత భూభాగం కోసమే ఆధునిక భారత జాతి అనే స్పష్టమైన రేఖకు సంబంధించిన బెంచ్ మార్క్ వ్యవస్థాపితమైంది. బ్రిటిష్ వలస పాల కులకు వ్యతిరేకంగా భారతీయుల ప్రప్రథమ తిరుగుబాటు 1857లోనే జరిగింది. మరి ఆనాడు ఆ తిరుగుబాటును ప్రేరేపించి, అమలు పర్చడానికి తమ భౌతిక, మానసిక శక్తిని వెచ్చించిన శక్తులు ఏవి?బ్రిటిష్ సామ్రాజ్యవాద శక్తి నియంత్రణ నుంచి భూభాగాన్ని కాపాడటానికి తమ భౌతిక శక్తి ద్వారా దోహదం చేసిన శక్తులు ప్రధా నంగా శూద్రులు, దళితులు, ఆదివాసీల్లోనే రూపుదిద్దుకున్నాయి. బ్రిటిష్ సైన్యంలోని వివిధ రెజిమెంట్లలో శూద్రులు, దళిత రైతాంగం, వారి పిల్లలు లేకుండా ఉంటే, 1857 తిరుగుబాటు సాధ్యమయ్యేదే కాదు. వేదాలు, రామాయణం, మహాభారతం వంటి బ్రాహ్మణ పుస్త కాలను పోలిన చరిత్ర రాసిన ఆర్ఎస్ఎస్, హిందుత్వ లేదా వామపక్ష ఉదార ద్విజ రచయితలు కానీ.. ఆవు, పంది కొవ్వు వంటి సెంటిమెంట్లు కానీ ఆనాటి తిరుగుబాటుకు బాధ్యులు కారు. బ్రిటిష్ పన్నుల వ్యవస్థ పీడన, బ్రిటిష్ వలసవాద ప్రభుత్వానికి జీతం రాళ్లకోసం పనిచేస్తూ వచ్చిన అనేక మంది ద్విజ అధికారులతోపాటు, బ్రిటిష్ అధికారులు కలిసి సాగించిన దోపిడీనే... రైతు కమ్యూనిటీలు గ్రామస్థాయి నుంచి తిరుగుబాటు చేయడానికి ప్రేరేపించాయి. బ్రిటిష్ ప్రభుత్వం కోసం ఆ రోజుల్లో ఏ శూద్ర, దళిత, ఆదివాసీ అధికారులూ పనిచేసిన చరిత్ర లేదు. బ్రిటిష్ వారు ఇక్కడికి రాక ముందే మొఘల్ పాలనలోకూడా ముస్లిం అధికారులతోపాటు, ద్విజులు (ప్రధానంగా బ్రాహ్మణులు, కాయస్థులు, ఖాత్రిలు) మాత్రమే అధికారులుగా పనిచేశారు. ముస్లిం రాజరిక పాలన పొడ వునా బనియాలు గ్రామ, పట్టణ స్థాయిలో వ్యాపార కార్యకలాపాల్లో కొనసాగుతూ వచ్చారు. బ్రిటిష్ పాలనలో కూడా వీరు తమ వృత్తికే పరిమితమయ్యారు. వర్ణధర్మ నియమాలను ధిక్కరించి శూద్రులను, దళితులను, ఆదివాసులను విద్యావంతులుగా చేయలేకపోయారు కాబట్టే ఈ మూడు విభాగాలకు చెందినవారు ఆనాడు ప్రభుత్వ ఉద్యో గాల్లోకి అసలు ప్రవేశించలేకపోయారు.భారతదేశంలో అతిపెద్ద మానవ జనాభా శూద్రులదే. భారత రాజ్యాంగ ప్రవేశికలో భారత్ అని పేర్కొన్న పదంలో అధిక భాగం శూద్రులకే వర్తిస్తుంది. వీరు జాతి రక్తమాంసాలుగా నిలిచారు. జాతి మొత్తం శారీరకంగా, మేధోపరంగా ఒక్కటై మానవతావాద తాత్విక పునాదిపై నిలిచి పోరాట రూపాలను, పద్ధతులను రూపొందిం చుకున్నప్పుడే దురాక్రమణ శక్తి నుంచి మన భూభాగాన్ని చేజిక్కిం చుకోవడం సాధ్యపడుతుంది. అప్పుడు మాత్రమే విదేశీ బంధనాల నుంచి మన భూభాగం విముక్తి చెంది జాతిగా మనగలుగుతుంది. విద్యాహక్కుకు దూరమైనప్పటికీ శూద్ర, దళిత, ఆదివాసీలు అలాంటి కీలక పాత్రనే ఆనాడు పోషించారు.కానీ, బ్రిటిష్ పాలనాయంత్రాంగం తన పాలన చివరి దశాబ్దాల్లో స్కూల్ విద్యను శూద్ర, దళిత, ఆదివాసీలకు తెరిచి ఉంచింది. దీనివల్లే మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, బీఆర్ అంబేద్కర్ మొట్టమొదటి శూద్ర, దళిత మేధావులుగా ఆవిర్భవించి, వెయ్యేళ్లకు పైబడిన పురాతన వర్ణధర్మ దోపిడీని, కుల అణచివేతను సవాలు చేయగలిగారు. ఈ కమ్యూనిటీల సజీవ చరిత్రలో తొలిసారిగా విద్యావంతులైన మేధావులు ఇంగ్లిష్‌ని చదవడం, రాయడం, అర్థం చేసు కోవడం సాధించగలిగారు. ఇక్కడే వారి తొలి విముక్తి మార్గం ఆరంభ మైంది.కానీ నెహ్రూవియన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ద్వంద్వ విద్య (ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లిష్ విద్యకు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాంతీయ భాషలకు పట్టం కట్టడం) వల్లే శూద్రుల, దళితుల విముక్తి మార్గం అనేక అడ్డంకులను ఎదుర్కొంది. ఇందువల్లే మన దేశంలోని ఉత్పాదక శక్తులు ఇప్పుడు జీవితంలోని అన్ని రంగాల్లోనూ అసమాన అస్తిత్వంతో కొట్టుమిట్టాడుతున్నాయి. బ్రిటిష్ ఇండియన్ ఇంగ్లిష్ భారతదేశంలో బ్రిటిష్ పాలకుల పాలక భాషగా 1835లో రూపుదిద్దుకున్న సమయానికి, శూద్ర, దళిత, ఆదివాసీలు విద్యావ్యవస్థకు పూర్తిగా అవతలే ఉండిపోయారు. 1817లో కలకత్తాలో తొలి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రారంభించిన తర్వాత, ఆ వలస భాషకూడా అప్పటివరకు సంస్కృతంపై అదుపు సాధించిన ద్విజుల ఇళ్లలోకే ప్రవేశించింది. బెంగాలీ బ్రాహ్మణ జమీం దారీ కుటుంబానికి చెందిన రాజా రాంమోహన్ రాయ్ (1772%--% 1833) బ్రిటిష్ అధికారులతో తన కుటుంబ సంబంధాల ద్వారా ఇంగ్లిష్‌ని 18వ శతాబ్ది చివరలోనే నేర్చుకోగలిగాడు.భారత్‌లో సంస్కృత బ్రాహ్మణులకు, గొడ్డు మాంసం ఆరగించే బ్రిటిష్ ఇంగ్లిష్ మాట్లాడే అధికారులకు మధ్య భాషా బాంధవ్యం అలా ఏర్పడింది. రామ్మోహన్ రాయ్ తండ్రి రమాకాంత్ రాయ్ వైష్ణవ బ్రాహ్మణుడు. అయినా రామ్మోహన్ రాయ్‌ని సంస్కృతంతోపాటు పర్షియన్, ఇంగ్లిష్ నేర్చుకోవడానికి అనుమతించాడు. రామ్మోహన్ రాయ్‌తో ప్రారంభమైన ఇంగ్లిష్ విద్య తర్వాత బెంగాల్‌లో మిషనరీగా జీవించిన విలియం కారే, రాయ్ అధ్వర్యంలో పాఠశాల విద్యా వ్యవస్థగా మారింది.

# మంత్రాలయ యతీంద్రులు

**భక్తి**

'ప్రహ్లాదుడు' అనే మాటకు ఆనంద స్వరూపుడు అని అర్థం. ఆనందంతో ఉండేవాడు, దాన్ని పంచేవాడు ప్రహ్లాదుడు. మంత్రాలయ రాఘవేంద్ర యతీంద్రులను ప్రహ్లాదుడి అవతారంగా భావించడంలో రహస్యం అదే!

భాగవతంలో 'కలడు కలడు అనెడివాడు కలడో లేడో' అని కలవరపడిన సంశయాత్ముడు- గజేంద్రుడు. 'ఎందెందు వెతికి చూసిన అందందే గలడు' అంటూ సంబరపడిన నిశ్చయాత్ముడు- ప్రహ్లాదుడు. నిరంతరం ఆనందమయ స్థితిలో ఉంటూ, దైవం పట్ల నిశ్చయ జ్ఞానం కలిగిన సద్గురువు రాఘవేంద్రస్వామి. సాత్విక జీవన మార్గంలో భగవంతుణ్ని చేరుకొనే విస్పష్టమైన మార్గాన్ని బోధించి, ఆయన గుర్తింపు పొందారు.

రుగ్వేద భాష్యంలోని మొదటి 40 సూక్తులకు తొలిసారిగా ద్వైత సంప్రదాయంలో చేసిన వ్యాఖ్యానం ఆయనకు విశేష కీర్తిని అందించింది. ద్వైత సిద్ధాంతానికి, వైష్ణవ సంప్రదాయానికి విశ్వఖ్యాతిని చేకూర్చిన గొప్ప ఆచార్యుడిగా, దార్శనికుడిగా ప్రసిద్ధికెక్కారు. ఆయన రూపొందించిన మహిమాన్విత బృందావనం భక్తుల పాలిట కల్పవ ృక్షంగా, కామధేనువుగా ఇప్పటికీ మన్నన అందుకుంటోంది.తిమ్మనభట్టు, గోపికాంబకు తిరుమలదేవుడి అనుగ్రహంతో జన్మించిన కారణంగా 'వేంకట నాథుడు' అని పేరు పెట్టారు. జాతక చక్రాన్ని పరిశీలించిన కుంభకోణ పీఠాధిపతులు సుధీంద్రతీర్థులు- ఆ బాలుడి ఆత్మతత్వాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కనిపెట్టారు. తన తదుపరి పీఠాధిపతి బాధ్యతను ఆయనకు అప్పగించాలని ఆదేశించారు. వేంకట నాథుడి ఏకాగ్రత, ఉపాసనా పటిమ గొప్పవి. ఒకసారి గంధం తీసే సమయంలో అగ్నిసూక్తం పఠించడం వల్ల, ఆ చల్లని చందనాన్ని ఒంటికి పూసుకొన్నవారికి కాలి మంటలు పుట్టాయట. వరుణసూక్తం పఠిస్తూ తీసిన గంధంతో, ఆ శరీర తాపం చల్లారిందని చరిత్ర చెబుతోంది. మహత్వపూర్ణమైన అటువంటి విశేషాలు ఆయన అనంతర కాలంలోనూ వెలువడ్డాయి. థామస్ మన్రో కలెక్టరుగా ఉన్న రోజులవి. అప్పట్లో పీఠానికి చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయి. వాటిని రైతులకు పట్టాలుగా ఇచ్చేందుకు ఆయన వెళ్లారు. రాఘవేంద్రస్వామి దర్శనం లభించింది. తమ భూమి అసలు దస్తావేజులు ఎక్కడున్నాయో స్వామి తెలియజేశారట. వాటిని మన్రో వెతికి తీయించి, భూముల్ని తిరిగి పీఠానికి అప్పగించినట్లుగా 'బళ్లారి గజెట్'లో ఆయన పేరిట ప్రచురితమైన లేఖ వెల్లడించింది.రాఘవేంద్రస్వామి మధ్వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించి, దేశమంతటా పర్యటించారు. ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించారు.

చంద్రిక, న్యాయ సుధ, తంత్ర దీపిక, న్యాయ ముక్తావళి వేదాంత గ్రంథాల్ని రచించారు.పరివ్రాజకులుగా రాఘవేంద్రుల పాత్ర ఎంతో విశిష్టమైనది. మంత్రాలయంలో తాను ఏర్పాటుచేసిన బృందావనంలో అనంతమైన శక్తిని నిక్షేపించారంటారు.



# నవతార

## ముఖంపై ముడతలు నివారించండిలా



ఒత్తిడి, కాలుష్యం కారణంగా కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గి ముఖంపై ముడతలు ఏర్పడతాయి. మంచి పోషకాహారం తీసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. అవేంటో చూద్దాం!

**తేనె:** చర్మ కణాలను రక్షించడంలో తేనెదే ప్రథమ స్థానం. ఇది చర్మంపై తేమ నిలిచి ఉండేలా చేస్తుంది. స్వచ్ఛమైన తేనెను ముఖమంతా రాసి బాగా ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే చర్మంపై ముడతలు తగ్గి ఆరోగ్యంగా ఉంటుంది.

**కలబంద:** కలబంద గుజ్జులో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. ఈ గుజ్జును ముఖమంతా పట్టించి ఇరవై నిమిషాల తరవాత మంచినీటితో కడగాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే చర్మంలో హైడ్రేషన్ స్థాయి పెరిగి ముఖం మీద గీతలు, ముడతలు తగ్గుతాయి.

**కొబ్బరినూనె:** కొబ్బరినూనెలోని ఫాటీ యాసిడ్స్ చర్మానికి పోషణనిస్తాయి. ఒక బౌల్‌లో అయిదు చెంచాల కొబ్బరి నూనె వేసి కొద్దిగా వేడి చేయండి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెను ముఖమంతా రాస్తూ ఒకే దిశలో మర్దన చేయండి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే ప్రయోజనం ఉంటుంది..ఆలివ్ ఆయిల్: ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్రీ రాడికల్స్, ఆరోగ్యకరమైన క్రొవ్వులు ఉంటాయి. ఆలివ్ ఆయిల్‌తో ముఖం మీద మసాజ్ చేసినపుడు ఇవి చర్మకణాల్లో ఒత్తిడిని తగ్గిస్తాయి. ముఖమంతా రక్తప్రసరణ జరుగుతుంది. దీనివల్ల నుదుటి మీద గీతలు, కంటి చుట్టూ ఉండే ముడతలు పోతాయి.

# హెల్దీ స్నేహం...



స్నేహాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటే ఆశ్చర్యంగా ఉంది కదా... కాని కొందరు అధ్యయనకారులు చేసిన ఒక స్టడీ ప్రకారం మనకున్న సావాసాలను బట్టి కూడా మన ఆరోగ్యం తీరుతెన్నులు ఉంటాయట. వారు చేసిన స్టడీలో ఇరవై ఏళ్ల వయసులో ఏర్పడ్డ స్నేహాలు భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సామాజిక సంబంధాలను పెంపొందించడంలో సహాయపడతాయట. దీని వల్ల యువతలో ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి సమస్యలూ రావట. వ్యక్తుల మధ్య బంధాలు గాఢంగా ఉంటే యాంగ్జయిటీ, డిప్రెషన్‌లు తలెత్తవట. అంతేకాదు 20లలో ఉన్నప్పుడు చాలామంది స్నేహితులుండాలిట. అదే 30 ఏళ్లు దాటిన తర్వాత మాత్రం స్నేహాలు 'సెలక్టివ్'గా ఉంటేనే మంచిదట. మంచి స్నేహితులు ఎప్పుడూ సంతోషాన్నిస్తారు. జీవితాంతం తామున్నామనే భరోసాను స్నేహితులకు కలిగిస్తారు. ఇలాంటి వాళ్లకి డిప్రెషన్, యాంగ్జయిటీ లాంటి బాధలు ఉండవట. ఒత్తిడి చాలా ప్రమాదకారి. దీనివల్ల శరీరంలో రసాయన మార్పులు సంభవించి రోగనిరోధకశక్తి తగ్గుతుంది. అయితే మంచి స్నేహాలున్నవారిలో ఒత్తిడి సమస్య ఉండదట. అంతేకాదు వారి మధ్య స్నేహం టీమ్ బిల్డింగ్ టాక్టిక్స్‌ను పెంచుతుందిట. లైఫ్ స్కిల్స్‌ను నేర్పుతుందిట. అయితే ఏదీ అతిగా ఉండకూడదని మన పెద్దలంటారు. అందుకే ఎక్కువమందితో స్నేహాలు చేయడం కూడా మంచిది కాదు. స్నేహాలు అపరిమితంగా ఉంటే అది పనిమీద ప్రభావం చూపుతాయి. చదువులను దెబ్బతీస్తాయి. కుటుంబ సంబంధాలకు దూరం చేస్తాయి. అంతేకాదు పీర్ ప్రెషర్ వల్ల చెడు అలవాట్లకు అంటే మద్యం తాగడం, సిగరెట్లు, డ్రగ్స్‌కు బానిసలయ్యే ప్రమాదం కూడా ఉంది. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను స్నేహాలకు దూరం చేయకూడదు. స్నేహితులుంటే పిల్లలు సరిగా చదువుకోరనే అభిప్రాయం చాలామంది పెద్దవాళ్లల్లో ఉంది. నిజానికి స్నేహితుల వల్లే పిల్లలు తమ లోపలున్న అభిరుచులేమిటో తెలుసుకోగలుగుతారు. తమదైన వ్యక్తిత్వాలను పెంచుకోగలుగుతారు. చక్కటి స్నేహాలతో తమ పర్సనాలిటీని తీర్చిదిద్దుకోగలుగుతారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల ఇష్టాయిష్టాలు గమనించకుండా 'వారితో స్నేహం చేయి...వీరితో స్నేహం చేయొద్దు' అని వాళ్లపై ఒత్తిడి తెస్తుంటారు. ఫలితంగా వాళు డిప్రెషన్‌కు లోనవుతారు. వారిలో యాంగ్జయిటీ, ఇదీ అని చెప్పలేని ఫోబియా పెరుగుతాయి. అందుకే తల్లిదండ్రులు కూడా పిల్లల మనస్తత్వాలను, వారి ఇష్టాలను గమనించుకుంటూ వారిని సరైన దారిలో పెట్టాలి. పిల్లల మధ్య స్నేహాలను ప్రోత్సహించాలి. వారిని ఆరోగ్యవంతులుగా ఉంచాలి.

**మంచి స్నేహితులు ఎలా ఉండాలి...**

జడ్జిమెంటల్‌గా ఉండకూడదు.

అసూయ, స్వార్థం, దురాశ లాంటి గుణాలు ఉండకూడదు.

అలాగే ఎలాంటి పరిస్థితుల్లోనూ వాళ్లు హద్దులు దాటి ప్రవర్తించకూడదు.

స్నేహితుని మైండ్‌సెట్ ఎలాంటిదో అర్థం చేసుకోవాలి.

స్నేహితులు తమ పనిపై ద ృష్టి నిలిపేలా సహకరించాలే తప్ప వారి పనిని డిస్టర్బ్ చేయకూడదు.

స్నేహితుల నుంచి రివార్డులు ఆశించి సహాయం చేయకూడదు.

కష్టసుఖాల్లో ఒకరికొకరు సహాయపడాలి.

చెడు అలవాట్లకు, స్నేహాలకు అలవాటుపడకుండా తమ స్నేహితులను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తుండాలి.

# చీరకు మల్లే జీరాడుతూ



సల్వార్, కమీజ్ అంటే కొన్నాళ్ల క్రితం వరకు కూడా కమీజ్ పొడవు మోకాళ్ల వరకో లేదో కాస్త కిందుగానో ఉండాల్సిందే. కాని ఎప్పుడూ ఒకేలాంటి డ్రస్ డిజైన్లతో విసుగెత్తిపోయి కమీజ్ పొడవును ఏకంగా పెంచేశారు డిజైనర్లు. అలా పెరిగి పెరిగి ఆ పొడవు చివరకు ఎంత వరకు వచ్చిందంటే పాదాలమీద జీరాడేవరకు. అచ్చం చీర కుచ్చుళ్లకు మల్లే. వీటికిందకు సల్వార్‌కు బదులుగా లాంగ్‌స్కర్ట్స్, లూజ్‌గా ఉండే పారలల్ ప్యాంట్ల వంటివి వేసుకుంటున్నారు. ఏ మోడల్ అయితేనేం కాని జోడీ బాగా కుదిరింది ఈ స్టయిల్‌కు.

ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ మంత్ర

ఆన్‌లైన్ అలవాటయ్యాక ఫ్యాషన్ మంత్రం పఠించేవాళ్ల సంఖ్య పెరిగిపోయింది. ఒక్క క్లిక్‌తో నచ్చిన కాస్ట్యూమ్స్ వచ్చేస్తుండటంతో ఆన్..లైన్స్ ఆర్ బిజీ అయిపోతున్నాయి. ఓ కన్సల్టింగ్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఆన్‌లైన్ అంగట్లో ఫ్యాషన్ పొటెన్షియల్ ఏ రేంజ్‌లో ఉందో వెల్లడైంది.

## ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ షాపింగ్ చేస్తున్న మహిళల సంఖ్య..



2015 లో 1.5 కోట్లు

2020లో 7.5 కోట్లు

ఫ్యాషన్ ట్రెండ్స్ గురించి ఆన్‌లైన్‌లో షేర్ చేసుకుంటున్న మహిళల సంఖ్య గతేడాదితో పోలిస్తే 2020 నాటికి 110% పెరగనుంది.

2015లో 20%

2020లో 42%

గూగుల్‌లో సెకనుకొకరు నయా ఫ్యాషన్స్ గురించి సెర్చ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ రిటైల్ మార్కెట్‌లో ఫ్యాషన్ సెక్టార్ వాటా ఈ ఏడాది 20% ఉంటే.. వచ్చే ఏడాది నాటికి 23-25% వరకు పెరగనుంది.

ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ రెవెన్యూ వచ్చే ఏడాది 35-40% అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది.ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులదే రాజ్యం. అయితే 2020 నాటికి ఆన్‌లైన్ మార్కెటింగ్ కస్టమర్లలో ప్రతి ముగ్గురిలో ఒక్కరు లైఫ్‌స్టయిల్-ఫ్యాషన్ ప్రొడక్ట్స్ కొనుగోలు చేస్తారని అంచనా.

# ఆరోగ్యకరమైన హృదయానికి ఐదు సాధారణ సూత్రాలు



**హైదరాబాద్:** మనదేశంలో సగటు శ్రమజీవుల పౌరుల నిశ్చల జీవితాలపై శరవేగంగా పెరుగుతున్న కార్డియో వాస్కులర్ – గుండె సంబంధ వ్యాధులు (సీవీడీ) ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పౌరుల ఆరోగ్య సమస్యలను గుర్తించి మెరుగైన చికిత్సను అందిస్తూ సమర్థవంతంగా వాటిని నివారిస్తూ పౌరుల గుండెలు ఆరోగ్యకరంగా ఉండేందుకు వైద్యులు మెరుగైన వైద్య చికిత్సా విధానాలు అమలు చేస్తున్నారు. తొలి దశలో పౌరుల ఆరోగ్య పరిరక్షణలో రక్షణాత్మక విధానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. తమ ఆరోగ్యం పట్ల ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆందోళనను పరిగణనలోకి తీసుకుంటే వారిలో జీవన విధానంలో పలు సాధారణ మార్పులు చేసుకుంటే సరి. ఆరోగ్యం పట్ల స్పృహతో పౌరులు తమ జీవన పద్ధతుల్లో ఐదు సాధారణ మార్పులు చేసుకుంటే గుండె సంబంధ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా గణనీయ స్థాయిలో సానుకూల ఫలితం సాధించొచ్చు.

**సుసంపన్న పౌష్టికాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ:**

పౌరుల ఆరోగ్యానికి స్థూలంగా పౌష్టికాహారం కీలకం. పౌష్టికాహారంపై జరిగిన అధ్యయనంలో గుండె ఆరోగ్య కరంగా ఉండాలంటే పౌరులు ప్రతిరోజూ 43 గ్రాముల బాదంపప్పు తినడంతో కొలెస్ట్రాల్ స్థాయి తగ్గిపోవడంతోపాటు గుండెలో కడుపు మంట స్థాయి కూడా తగ్గిస్తుంది. ఒమేగా – 3 ప్రోటీన్లకు సరైన వనరైన చేపలు తినడంతో లబ్ధి చేకూరుతుంది.

**చురుకైన జీవన విధానం అలవర్చుకోవాలిలా**

భౌతిక శ్రమ గుండెకు ఒక వరం వంటిది. అమెరికా హార్ట్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం ప్రతి వారం 150 నిమిషాల పాటు వ్యాయామం చేస్తే గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా 75 నిమిషాల సేపు తీవ్రమైన వ్యాయామం చేసినా సరిపోతుంది.

ఆరోగ్యకరంగా నడుము నిర్వహణ

నేరుగా దామాషా ప్రకారం గుండె, రక్తనాళాలను ఆరోగ్యకరంగా ఉంచాలంటే నడుము ఆరోగ్యకరంగా ఉండాలి. పొత్తికడుపు కొవ్వు పెరుగుదల రక్తంలో పంచదార (మధుమేహం) స్థాయిని, అధిక రక్తపోటును పెంచుతుంది. కృత్రిమ ట్రైగ్లిజరైడ్లతో గుండె సంబంధ రోగాల పెరుగుదలకు కారణమవుతుంది. ప్రతిరోజూ 42 గ్రాముల బాదం పలుకులు తినే వారిలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయి గణనీయంగా పెరుగుతుంది. బొడ్డు (బెల్లీ ఫ్యాట్)పై కొవ్వు, నడుము చుట్టు కొలతలు సరైన స్థాయికి తగ్గుముఖం పడటంతోపాటు గుండె సంబంధ రోగాలకు కారణాలను విశ్లేషిస్తుంది.

**దుమ పానంతో తీవ్రమైన గుండెపోటు**

సిగరెట్లు తాగడంతో ధమనుల లైనింగ్ దెబ్బ తీస్తుంది. తద్వారా కొవ్వులు ఘనీభవించడానికి దారి తీస్తుంది. సిగరెట్లు తాగడం వల్ల తీవ్రస్థాయిలో గుండెపోటు వస్తుంది.

**ఏబీసీని నియంత్రణలో ఉంచుకోవాలి**

ప్రతి పౌరుడు తన 'ఏబీసీ' స్థాయిని ఎప్పటికప్పుడు నియంత్రించుకోవాలి. బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్ నియంత్రించుకోవాలి. గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్‌ను పరీక్షించే 'ఎ1సి' పరీక్ష తప్పనిసరి. ప్రతి ఒక్కరి గుండెను ఆరోగ్యకరంగా కాపాడుకునేందుకు ఏబీసీ స్థాయిని నియంత్రించుకోవాలి. తద్వారా మాత్రమే మీ బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిని నిర్దేశిత స్థాయిలో కొనసాగిస్తాయి.ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఈ అంశాలపై ప్రతిజ్ఞ చేస్తే గుండె ఆరోగ్యకరంగా ఉండటంతోపాటు మెరుగైన జీవన విధానాన్ని అందుబాటులో ఉంచుతుంది.

# విప్ప.. ఎంతో గొప్ప



విప్ప చెట్టు బెరడును మెత్తగా దంచి రసం తీసి 5 మి.లీ. చొప్పున సేవిస్తే మేహవాతం నొప్పులు, రక్తపిత్తం వాతం తగ్గిపోతాయి.

ఎండిన విప్ప పూవులను వెచ్చచేసి, కాపడం పెడితే, వృషణాల వాపు, నొప్పి తగ్గుతాయి.

విప్పనూనెను పైన రాస్తే, దురదలు, వాపు నశిస్తాయి. చిన్న పిల్లల చేతుల మీద తరుచూ వచ్చే దురదలు కూడా తగ్గిపోతాయి.

విప్ప వేరు, 10 గ్రాముల తపసి చె ట్టు వేరు, ఆముదం వేరు దంచి, 50 మి.లీ. నీటితో కలిపి వడబోసి ఆ రసాన్ని తాగిస్తే గర్భస్రావ సమస్యనుంచి బయటపడవచ్చు.

50 గ్రాముల విప్ప చెట్టు పట్టను దంచి 100 మి.లీ నీటిలో కాచి ఆ కషాయాన్ని వెర్రికుక్క కరిచిన రోజున 30 మి.లీ. చొప్పున రెండు మోతాదులు, ఆ మర్నాడు ఒక మోతాదు ఇస్తే హైడ్రోఫోబియా బారిన పడకుండా ఉంచవచ్చు.

**విప్ప నూనెను తల కుదుళ్లకు పట్టిస్తే చుండ్రు తగ్గుతుంది.**

విప్ప కాయలను నూరి లేపనంగా వేస్తే గజ్జి కురుపులు మానిపోతాయి. విప్ప బెరడును నములుతూ ఉంటే, చిగుళ్ల కణజాలం నశించిపోవడం వల్ల ఏర్పడే మచ్చలు తగ్గడమే కాకుండా, తీవ్రమైన పంటి నొప్పి కూడా తగ్గిపోతుంది. గుట్కా, జర్దా లాంటివి తినే వారికి ఇది మేలు చేస్తుంది.

మామిడి, నేరేడు, విప్ప మర్రి నీటి చిగుళ్లను ముద్దగా నూరి, 4 రెట్ల నువ్వుల నూనెలో వేసి కాచి ఆ తైలాన్ని చెవిలో వేస్తే చెవిలోని ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి.

# ఊడే జుట్టుకు టానిక్!



జుట్టు తెగ ఊడిపోతోంది.. పలుచబడిపోతోంది.. బట్టతల వచ్చేస్తుందేమో...! ఈ మధ్య ఏ ఇద్దరు కలిసినా ఇలా జుట్టు చుట్టూనే మాటలు, ముచ్చట్లు. కారణాలేవైనా కానీ కాస్త కేర్ తీసుకోకపోతే తిరిగిరాని సంపద కోల్పోవడం ఖాయం. ఆలోచనలు ఆపేసి, పోషకాహారం తినేసి, దాంతో పాటు ఇక్కడ చెప్పిన పద్ధతిని కూడా ఫాలో అయిపోండి. ఇది ఇంట్లోనే తయారుచేసుకునే హెయిర్ కేర్ టానిక్.

కావలసినవి: ఓ మాదిరి సైజు ఉల్లిపాయలు – ఐదు, పచ్చి తేనె – అర కప్పు(చిన్న కప్పు తీసుకోవాలి కొలతకు), ఎసెన్షియల్ ఆయిల్ – పది చుక్కలు (నచ్చిన ఫ్లేవర్).


తయారీ: ఉల్లిపాయల పొట్టు తీసి మిక్సీలో వేసి పట్టాలి. తరువాత ఉల్లిపాయరసాన్ని వడకట్టాలి.

ఉల్లిపాయ రసంలో తేనె వేసి బాగా కలపాలి. తేనె, ఉల్లిపాయ రసాల టెక్చర్‌లు వేరుగా ఉండడం వల్ల ఈ రెండూ కలిసేందుకు కొంచెం సమయం పడుతుంది.

అవి కలిశాక ఎసెన్షియల్ ఆయిల్‌ను వేసి కలిపితే హెయిర్ ట్రీట్‌మెంట్ టానిక్ రెడీ.

ఈ టానిక్‌ను మాడు, జుట్టుకి రాసుకుని 45 నిమిషాల పాటు మర్దనా చేయాలి. రాత్రంతా అలానే ఉంచుకుని మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేయాలి.

# బరువు తగ్గించే మసాలా



అల్లంలో కొవ్వును కరగించే గుణంతో పాటు, జీవ క్రియల్ని వేగవంతం చేసే శక్తి కూడా ఉంది. అల్లం దంచి రసం తీసి, పొయ్యి పైన బాగా మరిగించాలి. బాగా మరిగిన తర్వాత ఎంత రసం ఉంటే, అంతే మోతాదులో తేనె కలిపి మరికాసేపు మరిగించి దించేయాలి. చల్లారిన తర్వాత ఒక సీసాలో భద్రపరుచుకోవాలి. అందులోంచి ఒక స్పూను రసం తీసుకుని దానికి ఒక గ్లాసు వేడి నీళ్లు కలిపి, ఉదయం, సాయంత్రం తీసుకుంటే, బరువు తగ్గడంతో పాటు క్రమంగా పొట్ట కూడా కరిగిపోతుంది.

కొవ్వును కరిగించడం ద్వారా బరువు తగ్గించే మరో మసాలా దినుసు దాల్చిన చెక్క. ఇది బరువును తగ్గించడంతో పాటు రక్తంలోని చక్కెర నిలువల్ని కూడా అదుపులోకి తెస్తుంది.. బాగా మరిగిన నీళ్లల్లో అరస్పూను దాల్చిన చెక్క పొడి వేసి రెండు నిమిషాల తర్వాత దించేయాలి. ఆ రసాన్ని రోజూ రెండు సార్లు తాగితే స్థూలకాయం తగ్గుతుంది.

భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత ఒక స్పూను జీలకర్ర తినేస్తే జీర్ణక్రియ బాగా జరిగి బరువు తగ్గుతారు. జీలకర్రలో రక్తహీనత, అర్శ మొలలు, మతిమరుపు, నిద్రలేమి వంటి సమస్యల్ని తగ్గించే శక్తి కూడా ఉంది.

నల్లమిరియాల్లోని పెపరీన్‌కు కొవ్వు కరిగించే గుణం ఉంది. ఈ మిరియాలను రోజుకు రెండుసార్లు కాస్తంత బెల్లంతో తీసుకుంటే బరువు తగ్గుతారు.

## అమెరికా ఎన్నికల వేళ రేపు స్టాక్ మార్కెట్ ఎలా ఉంటుందంటే..



న్యూఢిల్లీ-నవభూమి: ఇటీవల దీపావళి వేళ స్టాక్ మార్కెట్లు పాజిటివ్ ట్రెండ్ తర్వాత రేపు (సోమవారం) వీటి ధోరణి ఎలా ఉంటుందోనని మదుపర్లు ఆసక్తితో ఉన్నారు. ఎందుకంటే నవంబర్ 5న అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. దీంతోపాటు వడ్డీరేట్లపై ఫెడరల్ రిజర్వ్ నిర్ణయం, విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్ల కార్యకలాపాలు, దేశీయ కంపెనీల త్రైమాసిక ఫలితాలు కూడా ఈ వారం స్టాక్ మార్కెట్ల దిశను నిర్దేశించనున్నాయి. ఈ వారం కీలక ఈవెంట్లు ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

కారణాలివేనా..ప్రధానంగా నవంబర్ 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలపైనే అందరి దృష్టి ఉందని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా అన్నారు. ఇది కాకుండా భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లు, ముడి చమురు ధరలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయన్నారు. దేశీయంగా చూస్తే రెండో త్రైమాసిక ఫలితాలు కూడా చాలా కీలకం కానున్నాయని సంతోష్ మీనా చెప్పారు.

త్రైమాసిక ఫలితాలు..దేశీయంగా డాక్టర్ రెడ్డీస్, టైటాన్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్‌తో సహా ఇతర కంపెనీలు ఈ వారం త్రైమాసిక ఫలితాలను ప్రకటిస్తాయి. అలాగే %నాదీజ% మాన్యుఫ్యాక్చరింగ్ %ళావీ×% సర్వీసెస్ వంటి కీలక గణాంకాలు విడుదల కానున్నాయి. ఇవి మార్కెట్ పాయింట్ నుంచి ముఖ్యమైనవి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నిరంతర విక్రయాల కారణంగా గత నెలలో ప్రధాన సూచీలు తమ ఆల్‌టైమ్ గరిష్టాల నుంచి ఏడు శాతానికి పైగా పడిపోయాయి.




## వారంలో లక్ష కోట్లు పెరిగిన సంపద.. ఎక్కువగా లాభపడ్డ కంపెనీలివే..



**న్యూఢిల్లీ- నవభూమి:**దేశంలో టాప్ 10 అత్యంత విలువైన కంపెనీల్లో ఆరింటి మార్కెట్ క్యాపిటలైజేషన్ (మార్కెట్ క్యాప్) గత వారం స్టాక్ మార్కెట్లో( ఏకంగా రూ.1,07,366.05 కోట్లు పెరిగింది. ఈ క్రమంలో ప్రధానంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%బాదీ×%), ఐసీఐసీఐ బ్యాంకులు అత్యధికంగా లాభపడ్డాయి. కొత్త సంవత్సరం 2081 ప్రారంభానికి గుర్తుగా నవంబర్ 1న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో 'ముహూరత్ ట్రేడింగ్' నిర్వహించబడింది. ఈ నేపథ్యంలో గత వారం 30 షేర్ల %దీజు% సెన్సెక్స్ 321.83 పాయింట్లు లేదా 0.40 శాతం లాభపడింది. ఒక గంట ప్రత్యేక 'ముహూరత్ ట్రేడింగ్' సెషన్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు.

**ఈ కంపెనీల్లో మెరుగైన పనితీరు**

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మార్కెట్ క్యాపిటలైజేషన్ గత వారంలో భారీగా పెరిగింది. కానీ ఇదే సమయంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ సంస్థల ఆదాయాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి.

**పెరిగిన ఆదాయం**

గత వారంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాల్యుయేషన్ రూ. 36,100.09 కోట్లు పెరిగి రూ.7,32,755.93 కోట్లకు చేరుకుంది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.25,775.58 కోట్లు పెరిగి రూ.9,10,686.85 కోట్లకు చేరుకుంది. ఎల్ఐసీ మార్కెట్ క్యాప్ రూ.16,887.74 కోట్లు పెరిగి రూ.5,88,509.41 కోట్లకు, రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.15,393.45 కోట్లు పెరిగి రూ.18,12,120.05 కోట్లకు చేరాయి. ఇక ఐటీసీ వారంలో రూ.10,671.63 కోట్లు పెరుగగా, మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,13,662.96 కోట్లకు చేరుకుంది. హిందుస్థాన్ యూనిలీవర్ వాల్యుయేషన్ రూ.2,537.56 కోట్లు పెరిగి రూ.5,96,408.50 కోట్లకు చేరుకుంది.

ఈ కంపెనీలకు తగ్గిన ఆదాయం

ఈ ట్రెండ్‌కు భిన్నంగా ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.38,054.43 కోట్లు తగ్గి రూ.7,31,442.18 కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్ వాల్యుయేషన్ రూ.27,299.54 కోట్లు తగ్గి రూ.9,20,299.35 కోట్లకు స్థాయికి చేరింది. టీసీఎస్ వాల్యుయేషన్ రూ.26,231.13 కోట్లు తగ్గి, రూ.14,41,952.60 కోట్ల వద్ద ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,662.78 కోట్లు తగ్గి, రూ.13,26,076.65 కోట్ల స్థాయిలో ఉంది.

**ఏ నంబర్‌లో ఎవరున్నారు?**

ఇక టాప్ 10 కంపెనీల జాబితా విషయానికి వస్తే రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత వరుసగా టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ ఉన్నాయి.

## వచ్చే వారం రానున్న స్విగ్గీ, నివా బుపా సహా కీలక ఐపీఓలు




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లో(ఐపీఓల వీక్ మళ్లీ రానే వచ్చింది. ఈసారి రేపటి (నవంబర్ 4) నుంచి నుంచి ప్రారంభమయ్యే వారంలో 5 కొత్తగా రాబోతున్నాయి. వీటిలో 4 మెయిన్‌బోర్డ్ విభాగానికి చెందినవి. ఈ వారంలో ఫుడ్ డెలివరీ కంపెనీ స్విగ్గీ, ఆరోగ్య బీమా కంపెనీ నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ఐపీఓలలో డబ్బు పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. ఇది కాకుండా వచ్చే వారంలో ఇంకో కంపెనీ కూడా స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టనుంది. ఇది కూడా మెయిన్‌బోర్డ్ విభాగానికి చెందినది. ఆ విశేషాలేంటో ఇక్కడ తెలుసుకుందాం పదండి.

సగిలిటీ ఇండియా ఐపీఓ: రూ.2,106.60 కోట్ల ఈ ఐపీఓ నవంబర్ 5న ప్రారంభం కానుంది. నవంబర్ 7 వరకు ఇందులో డబ్బు పెట్టుబడి పెట్టవచ్చు. దీని ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 28-30గా నిర్ణయించబడింది. లాట్ పరిమాణం 500 షేర్లు. ఇష్యూ ముగిసిన తర్వాత నవంబర్ 12న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో షేర్ల లిస్టింగ్ జరుగుతుంది.

%ాజవీజు% సోలార్ హోల్డింగ్స్ ఈ ఇష్యూ నవంబర్ 6న ప్రారంభమై, నవంబర్ 8న ముగుస్తుంది. రూ. 2,900 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఒక్కో షేరు ధర రూ. 275-289. లాట్ పరిమాణం 51 షేర్లు. నవంబర్ 13న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్ల లిస్టింగ్ జరగనుంది.


రూ. 11,327.43 కోట్ల ఈ ఇష్యూ నవంబర్ 6న ప్రారంభమై, నవంబర్ 8న ముగుస్తుంది. నవంబర్ 13న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్లు లిస్టవుతాయి. బిడ్డింగ్ కోసం ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 371-390. లాట్ పరిమాణం 38 షేర్లు.

నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ %ఖూా%: రూ. 2,200 కోట్ల ఈ పబ్లిక్ ఇష్యూ నవంబర్ 7న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవబడుతుంది. ఈ ముగింపు నవంబర్ 11న జరుగుతుంది. దీని ధరను ఇంకా నిర్ణయించలేదు. నవంబర్ 14న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్ల లిస్టింగ్ జరగవచ్చు.

నీలం లినెన్స్ గార్మెంట్స్ %ఖూా%: ఈ ఇష్యూ నవంబర్ 8న తెరవబడుతుంది. నవంబర్ 12న ముగుస్తుంది. ఈ పరిమాణం రూ. 13 కోట్లు. ఒక్కో షేరుకు రూ. 20-24. ఇష్యూ ముగిసిన తర్వాత షేర్లు నవంబర్ 18న లిస్ట్ చేయబడతాయి.నవంబర్ 4న ప్రారంభమయ్యే కొత్త వారంలో కేవలం ఒక కంపెనీ మాత్రమే స్టాక్ మార్కెట్‌లలో జాబితా చేయబడుతుంది. అది ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్. రూ. 5,430 కోట్ల ఇష్యూ అక్టోబర్ 25న ప్రారంభమై, అక్టోబర్ 29న ముగిసింది. ఇది దాదాపు 3 రెట్లు సబ్‌స్క్రిప్షన్‌ను పొందింది.

### బంగ్లాదేశ్‌కు అల్టిమేటం.. ఏడో తేదీ లోపు బకాయిలు చెల్లించకుంటే

## విద్యుత్ సప్లయ్ నిలిపేస్తామన్న అదానీ పవర్




**న్యూఢిల్లీ-నవభూమి:**పొరుగు దేశం బంగ్లాదేశ్‌కు అదానీ పవర్ గట్టి షాక్ ఇచ్చింది. బకాయిలు చెల్లించక పోవడంతో బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా తగ్గించిన అదానీ పవర్.. బకాయిల చెల్లింపునకు గడువు పెట్టింది. ఈ నెల ఏడో తేదీ లోగా బకాయిలు చెల్లించకుంటే విద్యుత్ సరఫరా నిలిపేస్తామని అల్టిమేటం జారీ చేసింది. ప్రస్తుతం అదానీ పవర్ సంస్థకు బంగ్లాదేశ్ ప్రభుత్వం రూ.7,200 కోట్లు (850 మిలియన్ డాలర్లు) బకాయి ఉంది. ఈ బకాయి చెల్లింపు విషయమై బంగ్లాదేశ్ ప్రభుత్వ ఆధీనంలోని బంగ్లాదేశ్ పవర్ డెవలప్ మెంట్ బోర్డుకు, అదానీ పవర్‌కు మధ్య ఏమైనా సెటిల్మెంట్ జరిగిందా? అన్న విషయమై క్లారిటీ మిస్ అయ్యింది.

బకాయిలు చెల్లించడంతోపాటు సెక్యూరిటీ ఆఫ్ పేమెంట్ కోసం సుమారు రూ.1500 కోట్ల (170 మిలియన్ డాలర్లు)కు అక్టోబర్ 31 లోగా లెటర్ ఆఫ్ క్రెడిట్ అందజేయాలని బంగ్లాదేశ్ పవర్ డెవలప్ మెంట్ బోర్డుకు అదానీ పవర్ డెడ్ లైన్ పెట్టింది. కృషి బ్యాంకు ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ చేసేందుకు చర్యలు చేపట్టింది. కానీ ఇది పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ లో భాగం కాదని బీపీడీబీ వర్గాలు తెలిపాయి. డాలర్ల కొరత వల్ల విద్యుత్ బకాయిలు చెల్లించక పోవడానికి మరో కారణం అని ఆ వర్గాల కథనం. ఫలితంగా అక్టోబర్ 31 నుంచి జార?ండ్ లోని గొడ్డా పవర్ ప్లాంట్ నుంచి 1496 మెగావాట్ల విద్యుత్ బదులు 724 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసింది.


ఇటీవల రాజకీయ సంక్షోభంలో చిక్కుకున్న బంగ్లాదేశ్ లో ఆర్థిక సమస్యలు కూడా ఉన్నట్లు కనిపిస్తున్నది. గత నెలలో సుమారు 90 మిలియన్ల డాలర్ల విద్యుత్ బిల్లుల బకాయిలను అదానీ పవర్ కు బీపీడీబీ చెల్లించినట్లు సమాచారం. నెలవారీ 90-100 మిలియన్ డాలర్ల విద్యుత్ బిల్లులకు కేవలం 20-50 మిలియన్ డాలర్లు మాత్రమే చెల్లిస్తూ రావడం వల్లే బకాయిలు పెరిగిపోయాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్థిక, రాజకీయ సంక్షోభం నేపథ్యంలో బంగ్లాదేశ్ పవర్ సంస్థలు పవర్ పర్చేజింగ్ తగ్గించుకుంటున్నాయి. ఎన్టీపీసీతోకూడిన జాయింట్ వెంచర్ బంగ్లాదేశ్ ఇండియా ఫ్రెండ్ షిప్ పవర్ కంపెనీ సైతం బొగ్గు కొరత వల్ల సగానికంటే తక్కువ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నది. అదానీ పవర్ తయారు చేసే విద్యుత్ మీద యూనిట్ కు రూ.10-12 పలుకుతుంది. ఇండోనేషియా, ఆస్ట్రేలియాల నుంచి దిగుమతి చేసుకుంటున్న బొగ్గుతో తయారు చేస్తున్న విద్యుత్ చార్జీలు కాస్త ఎక్కువగానే కనిపిస్తున్నాయి.

## బీఎస్ఈ టాప్ 10 సంస్థల్లో ఆరింటి ఎం-క్యాప్ రూ.లక్ష కోట్లు లబ్ధి




**న్యూఢిల్లీ-నవభూమి:**గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలోని టాప్-10 సంస్థల్లో ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,07,366.05 కోట్లు పెరిగింది. వీటిలో భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఐసీఐసీఐ బ్యాంకు భారీగా లబ్ధి పొందాయి. సంవత్ 2081 ప్రారంభం సందర్భంగా శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో మూరత్ ట్రేడింగ్ నిర్వహించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 321.83 పాయింట్ల లబ్ధి పొందింది. మూరత్ ట్రేడింగ్ లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) లాభ పడ్డాయి. టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ నష్టాలతో ముగిశాయి. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.36, 100.09 కోట్లు పెరిగి రూ.7,32, 755.93 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంకు ఎం- క్యాప్ రూ.25,775.58 కోట్లు పుంజుకుని రూ.9,10,686.85 కోట్లకు చేరింది.భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.16,887.74 కోట్లు వృద్ధి చెంది రూ.5,88,509.41 కోట్లకు చేరుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.15,393.45 కోట్ల వృద్ధితో రూ.18,12,120.05 కోట్ల వద్ద స్థిర పడింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.10,671.63 కోట్లు పెరిగి రూ.6,13,662.96 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) ఎం-క్యాప్ రూ.2,537.56 కోట్లు పుంజుకుని రూ.5,96,408.50 కోట్ల వద్ద నిలిచింది.ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.38,054.43 కోట్ల నష్టంతో రూ.7,31,442.18 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.27,299.54 కోట్ల పతనంతో రూ.9,20,299.35 కోట్లకు చేరుకున్నది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.26,231.13 కోట్లు నష్టంతో రూ.14,41,952.60 కోట్ల వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎం-క్యాప్ రూ.3,662.78 కోట్లు నష్టపోయి రూ.13,20,076.65 కోట్లకు చేరుకున్నది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ-30లోని టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఇన్ఫోసిస్, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఎల్ఐసీ నిలిచాయి.

## సంవత్ 2081పై విశ్లేషకుల అంచనా ఇన్వెస్టర్లకు మళ్లీ రెండంకెల్లో రిటర్నులు!!



**న్యూఢిల్లీ- నవభూమి:**శుక్రవారంతో ప్రారంభమైన హిందూ సంప్రదాయ సంవత్సరం 'సంవత్ 2081'లోనూ బంగారం ఇదే ర్యాలీని కొనసాగిస్తుందా...అన్న ప్రశ్నకు అవుననే అంటున్నారు బులియన్ మార్కెట్ విశ్లేషకులు. ఈ సంవత్‌లోనూ బంగారం పెట్టుబడులు ఇన్వెస్టర్లకు రెండకెల్లో రాబడులు అందించవచ్చు నని కేడియా క్యాపిటల్ డైరెక్టర్ అజయ్ కేడియా అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం 2,750 డాలర్ల స్థాయిలో ట్రేడవుతున్న ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 2025లో 3,000 డాలర్ల స్థాయికి ఎగబాకవచ్చని అంచనా వేశారు. 'సవంత్ 2080' సంవత్సరంలో ఇన్వెస్టర్లకు బంగారం 32 శాతం, వెండి 39 శాతం రాబడులు అందించాయి. గోల్డ్, సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో (ఈటీఎఫ్) ఇన్వెస్ట్ చేసిన వారికి కూడా 30 శాతం వరకు రాబడి వచ్చింది. ఈ జూలైలో కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకం 9 శాతం తగ్గించడంతో మార్కెట్లో ధరలు 9 శాతం తగ్గినప్పటికీ, ఏడాది కాలంలో లోహం విలువ మూడో వంతు మేర పెరగడం గమనార్హం. సంవత్ 2067 (2011 తర్వాత) పసిడి ఇన్వెస్టర్లకిదే అత్యధిక రిటర్ను. కాగా, గత సంవత్‌లో సెన్సెక్స్ 25 శాతం, నిఫ్టీ 27 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేయగలిగాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం బంగారం ర్యాలీకి ఆజ్యం పోశాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో సద్దుమణిగేలా కన్పించడం లేదు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ కూడా ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు ముున్ముందు పరపతి సమీక్షల్లో ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించే అవకాశాలున్నాయి. ఈ రెండు కారణాలతో పసిడి, వెండి ధరలు మరింత జోరుగా పరుగులు తీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎలాంటి అనిశ్చితి లేదా సంక్షోభ సమయంలో అయినా భద్రమైన పెట్టుబడి సాధనంగా బంగారం నిలవడమే ఇందుకు దోహదపడుతున్న అంశం. పైగా, పసిడి-వడ్డీ రేట్లది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిరాదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది.

ధర పెరుగుదల..వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి. కాగా, చైనా ఆర్థిక, పారిశ్రామిక మందగనం నుంచి బయటపడేందుకు భారీగా ఉద్దీపనలు ప్రకటించింది. దాంతో ఆ దేశ పారిశ్రామకోత్పత్తి అవసరాలకు వెండి వినియోగం కూడా గణనీయంగా పెరగనుందని, ఫలితంగా రేటు కూడా పుంజుకోవచ్చున్న అంచనాలున్నాయి.

## యాపిల్ చేతికి ఇంటెల్?.. రేసులో సామ్‌సంగ్ కూడా..!




**క్యాలిఫోర్నియా- నవభూమి:** ప్రపంచ టెక్నాలజీ రంగంలో మరో భారీ డీల్‌కు సంకేతాలొస్తున్నాయి. ఐఫోన్ తయారీదారు యాపిల్ సంస్థ చేతికి.. చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ రాబోతున్నదన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. అయితే ఈ రేసులో ఈ రెండు క్యాలిఫోర్నియా ఆధారిత కంపెనీల నడుమ దక్షిణ కొరియా టెక్నాలజీ దిగ్గజం సామ్‌సంగ్ కూడా వస్తున్నట్టు చెప్తున్నారు. ఇంటెల్‌ను హస్తగతం చేసుకొనేందుకు యాపిల్‌తోపాటు సామ్‌సంగ్ సైతం తీవ్రంగానే ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

ఇదీ సంగతి..చిప్ తయారీలో ప్రపంచాన్ని శాసించిన ఇంటెల్.. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నది. అయితే ఈ సమయంలోనే ఈ టేకోవర్ వార్తలు వస్తుండటం ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ఒకప్పటితో పోల్చితే మార్కెట్‌లో నేడు ఇంటెల్‌కు గట్టి పోటీనే ఎదురవుతున్నది. దీంతో లాభాలు అంతకంతకూ పడిపోతున్నాయి. సామ్‌సంగ్, క్వాల్‌కామ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారత్ ఎలక్ట్రానిక్స్, క్రాంప్టన్ గ్రీవ్స్, టాటా ఎల్‌క్సీ, ఎన్విదియా, బ్రాడ్‌కామ్ తదితర కంపెనీలు చిప్ తయారీలో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇక సంప్రదాయ చిప్‌లతో పోల్చితే కృత్రిమ మేధస్సు (ఏఐ) చిప్స్ అభివృద్ధిలో వెనుకబడటం కూడా ఇంటెల్‌కు కొంత ప్రతికూలంగా మారింది.

**పీకల్లోతు కష్టాల్లో..**

ప్రస్తుతం ఇంటెల్ మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్లలోపే. 2021 ఫిబ్రవరిలో సంస్థ సీఈవోగా ప్యాట్ గ్లెసింగర్ బాధ్యతలు తీసుకున్న దగ్గర్నుంచి ఇంటెల్ షేర్ విలువ 60 శాతం పడిపోవడం గమనార్హం. ఇక వేతన భారం తగ్గించుకొనేందుకు ఈ ఏడాది 17వేల మందికిపైగా ఉద్యోగులను సంస్థ తొలగించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. గత నెల 31న ప్రకటించిన ఆర్థిక ఫలితాల ప్రకారం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఇంటెల్ నష్టం 16.6 బిలియన్ డాలర్లు. 56 ఏండ్ల కంపెనీ చరిత్రలో ఇంత నష్టం ఎప్పుడూ వాటిల్లలేదు. ప్రస్తుత ఏఐ బూమ్‌ను ఇంటెల్ అందిపుచ్చుకోకపోవడం కూడా దెబ్బతీసింది. ఎన్విదియా ఇప్పుడు ఏఐ చిప్ తయారీలో రారాజు. ప్రపంచంలోని అత్యంత విలువైన సంస్థల్లో ఒకటిగా కూడా ఉన్నది. కానీ ఒకప్పుడు సెమీకండక్టర్ సూపర్‌పవర్‌గా ఉన్న ఇంటెల్ మాత్రం కళావిహీనంగా మారిపోతున్నది. ఆధునిక టెక్నాలజీలను అందుకోలేక, సంప్రదాయ చిప్ తయారీకి డిమాండ్ లేక నష్టపోతున్నది.

**యాపిల్-ఇంటెల్ డీల్?**


2019లో ఇంటెల్ మోడెమ్ విభాగాన్ని యాపిల్ సొంతం చేసుకున్నది. అయితే కేవలం ఇంటెల్‌కు చెందిన మోడెమ్ డివిజన్‌ను మాత్రమే కాదు.. మొత్తంగా ఇంటెల్‌నే యాపిల్ చేజిక్కించుకున్నదన్న వదంతులూ వస్తుండటం గమనార్హం. అయితే ఇవి కేవలం ఊహాగానాలు మాత్రమేనని చెప్తున్నవారూ ఉన్నారు. యాపిల్ శక్తివంతమైన మ్యాక్ ల్యాప్‌టాప్‌లకు ఇంటెల్ చిప్‌లనే వాడేవారు. అయితే 2020 నుంచి యాపిల్ తమ సొంత సిలికాన్ చిప్‌లను వినియోగిస్తున్నది. దీంతో ఇంటెల్ మొత్తాన్ని యాపిల్ కొనలేదని అంటున్నారు. సిలికాన్ చిప్స్.. ఏఆర్ఎం ఆర్కిటెక్చర్ ఆధారంగా పనిచేస్తాయి. ఐఫోన్, ఐపాడ్, యాపిల్ టీవీ, యాపిల్ వాచ్, ఎయిర్ పాడ్స్, ఎయిర్‌ట్యాగ్, హోమ్‌పాడ్, యాపిల్ విజన్ ప్రో తదితర ఉత్పత్తులన్నింటిలోనూ సిలికాన్ చిప్స్‌నే వాడుతున్నారు.

## నవంబర్‌లో రెండు రోజులు యూపీఐ సేవలు బంద్.. కారణమిదే..

**న్యూఢిల్లీ- నవభూమి:**భారతదేశంలో ప్రతిరోజూ వేల కోట్ల రూపాయల విలువైన లావాదేవీలు జరుగుతున్నాయి. దీన్ని బట్టి దేశంలో యూపీఐ ఏ స్థాయిలో ఉపయోగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వాడకం ద్వారా నగదును తీసుకువెళ్లే అవసరమే లేకుండా లావాదేవీలను సులభంగా చేసుకోవచ్చు. ఈ నవంబర్ నెలలో రెండు రోజులు మాత్రం పనిచేయదు. దీనిని ఉపయోగించలేరు. కానీ అందరికీ మాత్రం కాదు. అయితే ఇది ఎవరికి పనిచేయదు, ఎన్ని రోజులు పనిచేయకుండా ఉంటుందనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.నవంబర్‌లో రెండు రోజుల పాటు సేవలను ఉపయోగించుకోలేరని బ్యాంక్ తన ఖాతాదారులకు తెలిపింది. బ్యాంక్ వెబ్‌సైట్ నుంచి వచ్చిన సమాచారం ప్రకారం కొన్ని ముఖ్యమైన సిస్టమ్ మెయింటెనెన్స్ సెట్టింగ్స్ కారణంగా బ్యాంక్ ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు చెప్పింది. బ్యాంక్ సేవను ఉపయోగించే కస్టమర్‌లు నవంబర్ 5, నవంబర్ 23న ద్వారా డబ్బు పంపలేరు లేదా స్వీకరించలేరు.

## వాట్సాప్ నుంచి మరో అద్భుతమైన ఫీచర్.. అదేమిటంటే..?!

**న్యూఢిల్లీ- నవభూమి:**ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ అనునిత్యం యూజర్ల కోసం సరికొత్త ఫీచర్లు తీసుకొస్తున్నది. అందులో భాగంగా 'మెన్షన్' అనే ఫీచర్ తీసుకొచ్చింది. మెటా అనుబంధ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ అప్ లోడ్ చేసే టైంలో నచ్చిన వ్యక్తులను 'ఏ' సాయంతో ట్యాగ్ చేస్తాం. అలా ట్యాగ్ చేయడం వల్ల ఆ వ్యక్తులకు మనం ఒక స్టోరీ పోస్ట్ చేసినట్లు నోటిఫికేషన్ వెళుతుంది. వారు కూడా నోటిఫికేషన్ చూడగానే మనం పోస్ట్ చేసిన స్టోరీ చదువుతారు. ఇటువంటి సదుపాయమే వాట్సాప్ కూడా తీసుకొచ్చింది. ఇక వాట్సాప్ యూజర్లు స్టేటస్ పెడుతున్నప్పుడు కాంటాక్టుల్లో నచ్చిన వ్యక్తుల్ని ట్యాగ్ చేయొచ్చు.వాట్సాప్‌లో స్టేటస్ అప్ లోడ్ చేస్తున్నప్పుడు 'యాడ్ క్యాప్షన్' అనే బార్‌కు కుడి వైపు 'ఏ' ఐకాన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయగానే మీకు వాట్సాప్ లోని కాంటాక్టులన్నీ కనిపిస్తాయి. వాటిల్లో మీకు నచ్చిన వ్యక్తుల ఫోన్ నంబర్లను మెన్షన్ చేస్తే సరి.. అలా మెన్షన్ చేసిన వారి ఫోన్ నంబర్లకు నోటిపికేషన్ వెళుతుంది. కానీ, ఇన్ స్టాలో మాదిరిగా ట్యాగ్ చేసిన వ్యక్తి పేరు అందరికీ కనిపించదని వాట్సాప్ తెలిపింది. యూజర్ల గోప్యతకు భంగం వాటిల్ల కుండా వాట్సాప్ ఈ ఫీచర్ డిజైన్ చేసింది.







## ఇరాన్‌లో హిజాబ్‌పై నిరసన.. బహిరంగంగా బట్టలు విప్పి తిరగిన మహిళ..

**ఇరాన్ – నవభూమి:** ఇరాన్ లో మహిళల వస్త్రధారణపై కొనసాగుతున్న ఆంక్షలు రోజురోజుకూ తీవ్ర ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ఇరాన్‌లోని మహిళలు తప్పనిసరిగా హిజాబ్ ధరించాలి. స్కార్ఫ్ వేసుకోవాలి. పూర్తిగా వదులుగా ఉండే దుస్తులు మాత్రమే వేసుకోవాలి. ఇరాన్ ప్రభుత్వం విధించిన ఈ ఆంక్షలపై 2022 నుంచే నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇస్లామిక్ డ్రెస్ కోడ్ నుంచి విముక్తి కావాలంటే అక్కడి మహిళలు నిరసన చేస్తూనే ఉన్నారు. తాజాగా ఓ మహిళ ఇరానియన్ యూనివర్సిటీలో షాకింగ్ పని చేసింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది టెహ్రాన్‌లోని ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆమె తన బట్టలను విప్పేసి కేవలం లో దుస్తులతోనే యూనివర్సిటీ ప్రాంగణంలో తిరిగింది. లో దుస్తులతో కాసేపు కూర్చుని, కాసేపు అటూ ఇటూ తిరిగింది. ఆ యువతిని అందరూ విచిత్రంగా చూశారు. కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాసేపటి తర్వాత ఇరాన్ అధికారులు ఆ మహిళను అరెస్టు చేశారు. ఆమె మానసిక పరిస్థితి బాగోలేదని, ఆమెను హాస్పిటల్‌కు తరలించినట్టు యూనివర్సిటీ ప్రతినిధి ఓ ప్రకటన విడుదల చేశారు.

# కెనడాపై కేంద్ర ప్రభుత్వం సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: భారత్ – కెనడా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. భారత కాన్సులర్ సిబ్బందిని కెనడా వేధింపులు, బెదిరింపులకు గురిచేస్తోందని మండిపడింది. తమ అధికారులను ఆడియో, వీడియో నిఘాలో ఉంచి దౌత్య ఒప్పందాలను తీవ్రంగా ఉల్లంఘించిందని ఆరోపించింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఓ ప్రశ్నకు సమాధానంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ (%వీజూూ%) ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కెనడాలోని భారత కాన్సులర్ అధికారులు ఆడియో, వీడియో నిఘా పరిధిలో ఉంటుంటున్నట్టు వెల్లడైందని, ఈ మేరకు కెనడా ప్రభుత్వానికి అధికారికంగా నిరసన తెలియజేసినట్లు ఆయన వివరించారు.

దౌత్యపరమైన ప్రతిష్టంభన నేపథ్యంలో కెనడాలోని చాలా మంది భారతీయ దౌత్య అధికారులు నిఘాలో ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి నిజమేనా అని ప్రశ్నించగా రణధీర్ జైస్వాల్ స్పందించారు. "అవును. మన కాన్సులర్ అధికారులలో కొందరు ఆడియో, వీడియో నిఘాలో ఉన్నారని, అలాగే కొనసాగుతారని కెనడా ప్రభుత్వం సదరు అధికారులకు ఇటీవల తెలిపింది. అధికారుల సంభాషణలను నియంత్రిస్తున్నారు. ఈ చర్యలపై కెనడా ప్రభుత్వానికి అధికారికంగా నిరసన తెలిపాం. నిఘా ఉంచడం ద్వారా సంబంధిత దౌత్య ఒప్పందాలను తీవ్రంగా ఉల్లంఘించారు" అని జైస్వాల్ వివరించారు.

టెక్నికల్ కారణాలను చూపించడం ద్వారా ఈ వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్న కెనడా ప్రభుత్వం వాస్తవాన్ని సమర్థించుకోలేదని జైస్వాల్ అన్నారు. అక్కడ ఉన్న మన దౌత్య, కాన్సులర్ సిబ్బంది ఇప్పటికే తీవ్రవాదం, హింసాత్మక వాతావరణంలో పనిచేస్తున్నారని, స్వయంగా కెనడా ప్రభుత్వం ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోందని మండిపడ్డారు.

మరోవైపు రష్యా, చైనా, ఉత్తర కొరియాతో పాటు భారత్‌ను కూడా 'సైబర్ శత్రువు'గా ఇటీవల కెనడా వర్గీకరించిందని, అక్కడి నెలకొన్న పరిస్థితికి ఇదొక ఉదాహరణ అని అన్నారు. భారత్‌పై దాడి చేసేందుకు కెనడా వ్యూహానికి ఇది మరో ఉదాహరణగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. తాను గతంలో చెప్పినట్టుగా భారత్‌కు వ్యతిరేకంగా ప్రపంచ అభిప్రాయాన్ని తారుమారు చేయడానికి కెనడా సీనియర్ అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ మేరకు వారు బహిరంగంగా అంగీకరించారని, గతంలో మాదిరిగా ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు గుప్పిస్తున్నారని జైస్వాల్ పేర్కొన్నారు.

కాగా ఖలిస్థాన్ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గత ఏడాది సెప్టెంబర్‌లో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ట్రూడో ఆరోపణలు అసంబద్ధమైనవని, ప్రేరేపితమైనవని కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేసిన విషయం తెలిసిందే.

## రైల్వే ట్రాక్‌పై విషాదం.. నలుగురు మృతి



**తిరువనంతపురం– నవభూమి:** రైల్వే ట్రాక్‌పై విషాదం చోటు చేసుకుంది. రైల్వే ట్రాక్‌పై చెత్తను శుభ్రం చేస్తున్న క్రమంలో నలుగురు కార్మికులను రైలు ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు మరణించారు. ఈ సంఘటన కేరళలో పాలక్కాడ్ జిల్లాలోని షోరనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం షోరనూర్ సమీపంలో భరత్‌పూజ నది ప్రవహిస్తుంది. ఆ నదిపై ఉన్న బ్రిడ్జి రైల్వే ట్రాక్‌ను ఈ కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఆ క్రమంలో ఢిల్లీ నుంచి తిరువనంతపురం వస్తున్న కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు వీరిని ఢీకొట్టింది. అయితే రైలు వస్తున్న క్రమంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను అధికారులు అప్రమత్తం చేయలేదని వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోవైపు రైలు సమీపంలోని వచ్చే వరకు ఆయా కార్మికులు సైతం గమనించ లేదని.. తీరా వారు గమనించే సరికి తప్పించుకునే మార్గం లేకుండా పోయిందనే వాదన సైతం వినిపిస్తుంది. ఇక ఈ దుర్ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ముగ్గురు కార్మికుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం పాలక్కాడ్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అయితే రైలు వచ్చే క్రమంలో రైల్వే బ్రిడ్జ్‌పై నుంచి మరో కార్మికుడు భరతపూజ నదిలో దూకి ఉండవచ్చని రైల్వే పోలీసులు అభిప్రాయపడుతున్నారు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మృతుల్లో ఇద్దరు మహిళలు సైతం ఉన్నారన్నారు. మృతుల స్వస్థలం తమిళనాడు అని పోలీసులు వివరించారు. వీరంతా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

## మేము గెలిస్తే నెలకు 7 కేజీల రేషన్, పెన్షన్ పెంచుతాం



**జార్కండ్-నవభూమి:** జార్కండ్‌అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా కొన్ని రోజులే సమయం ఉంది. దీంతో నేతలు ఓటర్లను ఆకట్టుకునేం దుకు కీలక హామీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్( కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ తమ ప్రభుత్వం ఏర్పడితే పీడీఎస్ కింద అందించే రేషన్ మొత్తాన్ని పెంచుతామని హామీ ఇచ్చారు. దీంతో పాటు పెన్షన్ మొత్తాన్ని పెంపు చేయడంతోపాటు మరికొన్ని హామీలు ప్రకటించారు. ప్రస్తుతం ప్రభుత్వం 5 కిలోల రేషన్ ఉచితంగా ఇస్తుండగా, దానిని 7 కిలోలకు పెంచుతామన్నారు. జార?ండ్‌లో జేఎంఎం నేతృత్వంలో ఇండియా అలయన్స్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వీటిని అమలు చేస్తామని హేమంత్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.టార్గెట్ బీజేపీ..అంతేకాదు జార?ండ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు 11 లక్షల మందికి రేషన్ కార్డులు రద్దు చేశారని జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆరోపించారు. రేషన్‌కార్డుల రద్దు వల్ల జార?ండ్‌లో చాలా మంది గిరిజనులు, దళితులు ఆకలితో చనిపోయారని వ్యాఖ్యానించారు. బీజేపీ హయాంలో రాష్ట్రంలో గిరిజనులు, దళితులు ఆకలితో చనిపోవడం సర్వసాధారణమన్నారు. కానీ మా ప్రభుత్వంలో మాత్రం జార్కండ్ ప్రజలు రేషన్, పెన్షన్ పెంపు, మంచి పోషకాహారం పొందుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

మహిళలకు రూ. 2500..ఇంకా మిగిలి ఉన్న వారిని కూడా పీడీఎస్‌లో చేర్చుతామని సోరెన్ చెప్పారు. ఇది కాకుండా మాయన్ సమ్మాన్ యోజన కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వనున్నట్లు ప్రకటించారు. జార?ండ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనంలో పిల్లలకు గుడ్లు, పండ్లు కూడా అందజేస్తామన్నారు. మా ప్రభుత్వం సామాజిక భద్రత విషయంలో అనేక చర్యలు తీసుకుందన్నారు. 40 లక్షలకు పైగా వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు సామాజిక భద్రతా పెన్షన్‌తో అనుసంధానించడం. శ్రామిక వర్గానికి పెన్షన్ వయస్సు 60 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలకు తగ్గించడం. 18-50 సంవత్సరాల వయస్సు గల మహిళలకు మైయా సమ్మాన్ యోజన వంటి అనేక పథకాలను అమలు చేసినట్లు గుర్తు చేశారు.

**ఎన్నికలు ఎప్పుడంటే..**

జార్కండ్‌లో రెండు దశల్లో నవంబర్ 13, 20 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కాగా నవంబర్ 23న కౌంటింగ్ జరగనుంది. మరి ప్రజలు ఏ పార్టీకి పట్టం కడతారో చూడాలి మరి. ఈ ఉచిత రేషన్ సహా పలు హామీలకు ప్రజలు ఆకర్షితులు అవుతారో లేదా తెలియాలంటే మాత్రం ఎన్నికల కౌంటింగ్ వరకు ఆగాల్సిందే. ఈ రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికల ఓటింగ్ జరగనుంది.

## ఇజ్రాయెల్ దాడుల్లో 77 మంది మృతి లెబనాన్, గాజాలపై కొనసాగిన పోరు



**ఇజ్రాయెల్: నవభూమి:** గాజా, టెల్‌అవీవ్, నవంబర్ 2: లెబనాన్, గాజాలపై ఇజ్రాయెల్ తన పోరు కొనసాగిస్తున్నది. లెబనాన్ ఈశాన్య ప్రాంతంలోని వ్యవసాయ గ్రామాలపై శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 52 మంది పౌరులు మరణించగా, అనేక మంది గాయపడినట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. కాగా, ఇజ్రాయెల్ వైమానిక దళాలు గురువారం ఒక దవాఖాన లక్ష్యంగా సెంట్రల్ గాజాలో జరిపిన దాడుల్లో 25 మంది పౌరులు మరణించారు. మూడు రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలున్న క్రమంలో గాజా సంక్షోభానికి తాత్కాలికంగా తెర దించడానికి ఇరు దేశాల మధ్య కాల్పుల ఒప్పందానికి బైడెన్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగానే ఇజ్రాయెల్ తన దాడుల పరంపర కొనసాగిస్తూనే ఉంది. కాగా, ఇజ్రాయెల్ లోని టైరా పట్టణంపై శనివారం తెల్లవారుజామున లెబనాన్ జరిపిన దాడుల్లో 11 మంది గాయపడినట్టు ఇజ్రాయెల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ తెలిపింది. లెబనాన్ నుంచి మూడు క్షిపణులు ప్రయోగించారని, వాటిని తిప్పికొట్టినట్టు వెల్లడించింది.


**ఇజ్రాయెల్ నిఘా కేంద్రంపై హెజ్బొల్లా దాడి**

ఇజ్రాయెల్ సైనిక నిఘా కేంద్రం గ్లిలోట్ బేస్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు హెజ్బొల్లా శనివారం ప్రకటించింది. టెల్ అవీవ్ సమీపంలోని గ్లిలోట్ బేస్ నుంచి శనివారం రాత్రి రాకెట్లతో దాడి చేశామని ఈ సంస్థ తెలిపింది.

**ప్రతీకారం తప్పదు: ఖమేనీ**

ఇరాన్‌పై దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌తోపాటు ఆ దేశానికి అండగా నిలుస్తున్న అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై, రెసిస్టెన్స్ ఫ్రంట్‌పై దాడులు జరుపుతున్నవారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని, శత్రువులు జియోనిస్టు పాలకులైనా, అమెరికా అయినా కోలుకోలేని దెబ్బ కొడతామని హెచ్చరించారు. ఇస్లామిక్ విప్లవం అనంతరం 1979లో టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని 45 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## గిన్నిస్ రికార్డు.. గుమ్మడికాయ పడవపై 26 గంటల ప్రయాణం



**వాషింగ్టన్– నవభూమి:** కడవంత గుమ్మడికాయను పడవగా చేసుకొని దానిపై 26 గంటల్లో 73.50 కిలోమీటర్లు ప్రయాణించి గిన్నిస్ ప్రపంచ రికార్డును సాధించాడు అమెరికాకు చెందిన గ్యారీ క్రిస్టెన్‌సేన్. ఒరెగ్యాన్ హ్యాపీవాయలీకి చెందిన గ్యారీ 555.2 కేజీల గుమ్మడికాయలోని గుజ్జును తీసి పడవగా మార్చాడు. దీంతో కొలంబియా నదిలో వాషింగ్టన్‌లోని నార్త్ బొన్నెవిల్లి నుంచి వాంకోవర్ వరకు ప్రయాణించాడు. గుమ్మడికాయ పడవపై అంతకు ముందెవ్వరూ ఇంత దూరం ప్రయాణం చేయకపోవడంతో దానిని గిన్నిస్ రికార్డుగా నమోదు చేశారు. స్వతాహాగా భారీ సైజులో గుమ్మడికాయలు పెంచడం గ్యారీకి అలవాటు. 2013లో అలా తయారు చేసిన గుమ్మడికాయ పడవపై ప్రయాణం చేసి స్థానిక పోటీలో బహుమతి గెల్చుకున్నాడు.

## ఏం చేసైనా అధికారంలోకి

# రావడమే మోదీ లక్ష్యం




**ప్రియాంక గాంధీ వాద్రా**

**వయనాడు:నవభూమి:** మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శలు గుప్పించారు. ప్రజాక్షేమం కోసం కాకుండా వాణిజ్యవేత్తల ప్రయోజనాల కోసమే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజలను విడగొట్టడం, విద్వేష వ్యాప్తి, ప్రజాస్వామిక సంస్థలను నీరుగార్చడం ద్వారా అధికారంలో కొనసాగడమే మోదీ సర్కార్ లక్ష్యమని వయనాడ్‌లో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక అన్నారు."మోదీ వాణిజ్య మిత్రుల కోసమే ఆయన ప్రభుత్వం పనిచేస్తుంది. ప్రజలకు మంచి భవిష్యత్తు ఇచ్చే ఆలోచన లేదు. కొత్త ఉద్యోగాల ఇవ్వదు, మెరుగైన విద్యా, ఆరోగ్య సౌకర్యాలు, ప్రోగ్రామ్‌ల పట్టింపు అసలే లేదు. ఏం చేసైనా అధికారంలో ఉండాలన్నదే వారి లక్ష్యం. మిమ్మల్ని విడగొడుతుంది, విద్వేష వ్యాప్తి చేస్తుంది. ప్రజాస్వామిక వ్యవస్థలను అణగదొక్కి మీ హక్కులను ఊడలాక్కుంటుంది" అని ప్రజలను ప్రియాంక అప్రమత్తం చేశారు.

రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచిన వయనాడ్ ప్రజలకు ప్రియాంక కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్ గాంధీని విమర్శించడమే పనిగా బీజేపీ పెట్టుకోవడంతో ఆయన ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని అన్నారు. ఆయన ప్రతిష్టను దిగజార్చేందుకు పెద్ద ఎత్తున ప్రచారం జరిగిందని, అయితే సత్యం కోసం పోరాడుతున్న రాహుల్‌కు ఇక్కడి ప్రజలు అండగా నిలిచారని, ఆయన పోరాటానికి దన్నుగా ఉన్నారని ప్రశంసించారు. గత ఎన్నికల్లో వయనాడ్ లోక్‌సభ నుంచి గెలిచిన రాహుల్ గాంధీ ఆ సీటుకు రాజనామా చేయడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. దీంతో ఆ సీటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక గాంధీ తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగారు. ప్రియాంకపై నవ్య హరిదాస్‌ను బీజేపీ ఎన్నికల బరిలోకి దింపింది. నవంబర్ 13న వయనాడ్ ఉపఎన్నికకు పోలింగ్ జరుగనుంది.

## శిలాజ ఇంధనాలకు బదులుగా చెట్లు.. విద్యుదుత్పత్తికి అనువైన రెండు జాతులు గుర్తింపు



**కిగాలి– నవభూమి:** శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా కొంత మేరకు స్వచ్ఛ విద్యుత్తును ఉత్పత్తి చేయగల రెండు చెట్ల జాతులను రువాండాకు చెందిన శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆఫ్రికా దేశమైన రువాండాలో విద్యుత్తు కొరత ఉంది. 2030 నాటికి గ్రామీణ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో విద్యుత్తును సరఫరా చేయాలని రువాండా నిర్ణయించింది.

దేశంలో వేగం గా, విరివిగా పెరిగే చెట్లపై అధ్యయనం చేయగా సెన్నా సియామియా, గ్లిరిసిడియా సేపియం అనే రెండు రకాల చెట్ల జాతులు విద్యుత్తు ఉత్పత్తికి అనువైనవని శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటి దట్టమైన కలప, అధిక కాలోరిఫిక్ విలువల వల్ల వీటిని కాల్చినప్పుడు ఎక్కువ వేడిని ఉత్పత్తి చేస్తాయి. ఈ చెట్లతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం పర్యావరణానికి మేలని వారు తెలిపారు.

# 500 మార్క్ దాటిన ఢిల్లీ వాయు కాలుష్యం..



**న్యూఢిల్లీ– నవభూమి:** దేశ రాజధాని ఢిలీలో దీపావళి రోజున బాణసంచా కాల్చారు. ఆ తర్వాత కాలుష్యం కొద్దిగా పెరిగింది. కానీ ఇప్పుడు దీపావళి జరిగిన రెండో రోజు తర్వాత కూడా ఎయిర్ క్వాలిటీ అధ్వానంగా తయారైంది. కాలుష్యం తీవ్ర స్థాయి నుంచి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఆదివారం (నవంబర్ 3న) ఉదయం 5 గంటలకు ఢిల్లీలో వాయు కాలుష్యంస్థాయి 500 దాటేసి 'ప్రమాదకర' కేటగిరీకి చేరుకుంది. దీంతో ఇది ఢిల్లీ దాని పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజల ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**నిర్దేశించిన పరిమితి కంటే**

దీపావళి జరిగిన రెండు రోజుల తర్వాత గాలి నాణ్యత తగ్గడం పట్ల అనేక మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెబ్‌సైట్ డేటా ప్రకారం దేశ రాజధానిని పొగమంచు దట్టంగా కప్పేసింది. ఈరోజు ఉదయం 5 గంటలకు 507 వద్ద నమోదైంది. ఇది ఢిల్లీ- పరిధిలో 2.5 స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన పరిమితి కంటే 65 రెట్లు ఎక్కువ ఉండటం విశేషం. ఇది తెలిసిన నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

**ప్రధానంగా ఈ ప్రాంతాల్లో**

దేశ రాజధాని ఢిల్లీలో 12 గంటల్లోనే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సంఖ్య 327 నుంచి 507కి పెరిగింది. ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో శనివారం రాత్రి 9 గంటలకు 327 వద్ద నమోదైంది. సమీర్ యాప్ ప్రకారం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అలీపూర్, ఆనంద్ విహార్, అశోక్ విహార్, అయా నగర్, బవానా, బురారీ, మధుర రోడ్, విమానాశ్రయం, ద్వారక, జహంగీర్‌పురి, ముండ్కా ప్రాంతాల్లో గాలి నాణ్యత తగ్గింది. దీంతోపాటు నరేలా, పట్‌పర్‌గంజ్, రోహిణి, షాదీపూర్, సోనియా విహార్, వజీర్‌పూర్, మందిర్ మార్గ్, నెహ్రూ నగర్, నజఫ్‌గఢ్ ఇతర వాతావరణ పర్యవేక్షణ స్టేషన్‌లలో కూడా గాలి నాణ్యత తగ్గిపోయింది.

**12 గంటల్లో ఏం జరిగింది**

దీపావళి తర్వాత ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 'తీవ్ర' స్థాయికి చేరుకోకపోవడానికి కారణం నిరంతరం వీస్తున్న బలమైన గాలులేనని నిపుణులు చెబుతున్నారు. శనివారం రాత్రి గాలి వేగం తగ్గడం వల్ల కాలుష్యం వేగంగా పెరిగిందని అంటున్నారు. ఇది కాకుండా రాత్రి ఉష్ణోగ్రతలు కూడా తక్కువగా ఉండటం కూడా ఓ కారణమని తెలిపారు. వాస్తవానికి తక్కువ ఉష్ణోగ్రతలు గాలి కదలికను నెమ్మదిస్తాయి. కాలుష్య కారకాలను భూమి ఉపరితలం పరిధిలో ఉంచుతాయి.

**ఎప్పుడు ప్రమాదకరమైనది?**

ప్రమాణాల ప్రకారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సున్నా నుంచి 50 మధ్య ఉన్నప్పుడు అది 'మంచి'గా పరిగణించబడుతుంది. 51 నుంచి 100 మధ్య ఉన్నప్పుడు అది 'సంతృప్తికరమైన' విభాగంలో ఉంటుంది. %ూూ×% 101 దాటి 200 కంటే తక్కువ ఉంటే అది మితమైనదని అర్థం. 201 నుంచి 300 మధ్యలో ఉంటే అది 'చెడు'గా పరిగణించబడుతుంది. అదే సమయంలో %ూూ×% 301 నుంచి 400 మధ్యకు చేరుకున్నప్పుడు, అది 'చాలా చెడు గాలిగా పరిగణిస్తారు. ఇక 401 నుంచి 500 మధ్య ఉన్నప్పుడు ఇది చాలా తీవ్రమైనది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ సోమవారం 4 । నవంబర్ । 2024

## తెలుగు ప్రేక్షకులతో మంచి అనుబంధం ఏర్పడింది : దుల్కర్ సల్మాన్



లక్కీ భాస్కర్ సినిమాతో టాలీవుడ్‌లో హ్యాట్రిక్ అందుకున్నాడు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ ఇప్పటికే తెలుగులో మహానటితో పాటు సీతారామం సినిమాలతో సూపర్ హిట్‌లను అందుకున్నాడు ఈ హీరో. ఇప్పుడు తాజాగా లక్కీ భాస్కర్ అంటూ వచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. గత ఏడాది 'సార్' సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. అయితే ఈ సినిమా సాధించిన విజయంపట్ల మూవీ టీం సక్సెస్ వేడుకను ఏర్పాటు చేసింది. ఈ వేడుకలో కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్‌తో పాటు, సీతారామం హను రాఘవపూడి వచ్చి సందడి చేశారు. ఇక ఈ వేడుకలో దుల్కర్ మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులతో నాకు మంచి అనుబంధం ఏర్పడినట్లు తెలిపారు. మలయాళంలో నా సినిమాలకు కూడా రాని కలెక్షన్లు తెలుగులో వస్తున్నాయి. ఒకే బంగారం మూవీ వచ్చినప్పుడు దిల్ రాజు గారు నాకు ఫస్ట్ కాల్ చేసి ఒక రోల్ ఆఫర్ చేశాడు. కానీ నేను అప్పుడు తెలుగుకు బయపడి ఒప్పుకోలేదు. తర్వాత నాగ్ అశ్విన్, స్వప్న దత్ నన్ను కన్విన్స్ చేసి మహానటిలో జెమిని గణేషన్ రోల్ చేయించారు. ఈ పాత్రకు నాకు మంచి గుర్తింపు లభించింది. అనంతరం హనుతో సీతారామం చేశాను. ఇప్పుడు లక్కీ భాస్కర్ రోజురోజుకి తెలుగు ప్రేక్షకులతో నాకు మంచి అనుబంధం ఏర్పడుతుంది అంటూ దుల్కర్ చెప్పుకొచ్చాడు.



## బిగ్గెస్ట్ మల్టివర్స్‌లో ప్రభాస్..?



సౌత్‌లో మోస్ట్ క్రేజీయస్ట్ ఫ్రాంచైజ్ గా లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ ఉంది. ఇందులో కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మాఫియా బ్యాక్ డ్రాప్ కథలను స్టార్ హీరోలతో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ లో 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' సినిమాలు వచ్చాయి. నెక్స్ట్ వీటికి సీక్వెల్స్ కూడా రాబోతున్నాయి. ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ సూపర్ స్టార్ రజినీకాంత్ తో 'కూలి' మూవీ చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకి రానుంది. ఇది క్రేజీ లీక్ దీని తర్వాత లోకేష్ కార్తీతో 'ఖైదీ' సీక్వెల్ చేసే ఆలోచనలో ఉన్నట్లు టాక్ నడుస్తోంది. ఇదిలా ఉంటే ఇండియన్ నెంబర్ వన్ స్టార్ డార్లింగ్ ప్రభాస్ ఇప్పుడు లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం కాబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. రీసెంట్ గా లోకేష్ ప్రభాస్ కి కథ చెప్పాడని, అతను కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు స్ట్రాంగ్ గా వినిపిస్తోంది. గతంలో లోకేష్ కనగరాజ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రభాస్ తో భారీ బడ్జెట్ సినిమా చేస్తానని చెప్పారు. అయితే అది ఎప్పుడు ఉంటుందనేది క్లారిటీ ఇవ్వలేదు. దళపతితో 'లియో 2'పై లోకేష్ కనగరాజ్ బిగ్ అప్‌డేట్ ఇప్పుడు అదే న్యూస్ మరోసారి తెరపైకి వచ్చింది. లోకేష్ కథకి ప్రభాస్ చాలా ఇంప్రెస్ అయ్యారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కోలీవుడ్ లో భారీ బడ్జెట్ చిత్రంగా ఈ మూవీ ఉండబోతుందని అంటున్నారు. 1000 కోట్ల బడ్జెట్ తో లోకేష్ కనగరాజ్ ఈ సినిమా ప్లాన్ చేస్తున్నాడు అంటూ కథనాలు వినిపిస్తున్నాయి. అయితే దీనికి సంబంధించిన ఎలాంటి అఫీషియల్ కన్ఫర్మేషన్ ఇప్పటివరకు రాలేదు. ప్రస్తుతం ఇదంతా ఒక ప్రచారం గానే ఉంది. ప్రభాస్ లైన్ అప్ లో ఏకంగా ఐదు సినిమాలు ఉన్నాయి. ఇవి కంప్లీట్ అయ్యేసరికి కనీసం మూడు నుంచి నాలుగు ఏళ్లు పడుతుంది. లోకేష్ కనగరాజ్ నిజంగా ప్రభాస్ కి కథ చెప్పిన ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి కనీసం నాలుగేళ్ల సమయం పట్టొచ్చు అని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పట్లో దానికి సంబంధించిన ఎలాంటి అఫీషియల్ ప్రకటన రాకపోవచ్చని భావిస్తున్నారు. మరోవైపు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో కూడా ప్రభాస్ భాగం అయినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ వర్మ చెప్పిన స్టోరీకి కూడా ఇప్పటి వరకు ప్రభాస్ ఓకే చెప్పలేదని టాక్. ఆయన కూడా లోకేష్, ప్రశాంత్ వర్మ కాంబినేషన్ ప్రభాస్ లో సినిమాలు కన్ఫర్మ్ అయిపోయినట్లు న్యూస్ వైరల్ అవుతోంది. ప్రభాస్ ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో 'ది రాజా సాబ్' షూటింగ్ కంప్లీట్ చేసే పనిలో ఉన్నారు. దీని తర్వాత హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' షూటింగ్ లో జాయిన్ అవ్వాల్సి ఉంటుంది. దాంతోపాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా వచ్చే ఏడాది ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. వీటి తర్వాత 'కల్కి 2898ఏడీ', 'సలార్ 2' కంప్లీట్ చేస్తాడని అనుకుంటున్నారు.

## రష్మిక పోస్ట్..మహారాణిలా చూసుకుంటానంటూ రిప్లై!

తాజాగా రష్మిక పోస్ట్‌కు బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ మహారాణిలా చూసుకుంటానంటూ రిప్లై ఇచ్చాడు. ఇంతకీ ఏంటా కహానీ అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. నేషనల్ క్రష్ రష్మికా మందన్న క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. యువత కలల నాయికగా మారిపోయింది. పాన్ ఇండియాలోనే నేషనల్ క్రష్ ఇప్పుడో సంచలనం. ఆమె నుంచి సోషల్ మీడియాకి ఎలాంటి ఫోటోలొచ్చినా.. పోస్టులొచ్చినా అవి నెట్టింట సంచలనమే. తాజాగా రష్మిక పోస్ట్ కు బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ మహారాణిలా చూసుకుంటానంటూ రిప్లై ఇచ్చాడు. ఇంతకీ ఏంటా కహానీ అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. శ్రీకాంత్ త్వరలో ఓ ఇంటి వాడు కాబోతున్నాడు. టాలీవుడ్ స్టార్ స్టైలిస్ట్ శ్రావ్య వర్మను వివాహం ఆడుతున్నాడు. ఇటీవలే శ్యావ్య స్నేహితులందరికీ బ్యాచిలర్ పార్టీ కూడా ఇచ్చింది. ఇందులో రష్మిక మందన్న, వర్ష బొల్లమ్మ కూడా పాల్గొన్నారు. అంతా పార్టీని ఫుల్ గా ఎంజాయ్ చేసారు. దీనికి సంబంధించిన ఓ ఫోటోని శ్రావ్య ఇన్ స్టా వేదికగా పంచుకుంది. నా గర్ల్ గ్యాంగ్ తో సింగిల్ గా ఇదే నా లాస్ట్ వీకెండ్%-% అని రాసుకొచ్చింది. దీనికి రష్మిక రిప్లై ఇలా ఇచ్చింది. స్టార్ హీరో సంపాదనలో 70శాతం ప్రజాసేవకే శ్రావ్య వర్మ మేడం పెళ్లి చేసుకుంటున్నారు. శ్రీకాంత్ కిదాంబి ఇకపై తన బాధ్యత నీదే. ఆమెను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి..ఒకే అంటూ రాసుకొచ్చింది. దీనికి శ్రీకాంత్ ఇలా స్పందించాడు. మహారాణిలా చూసుకుంటానన్నాడు. శ్రావ్య వర్మ సంచలన దర్శకుడు రాంగోపాల్ వర్మ మేనకోడలు. నాగార్జున, విజయ్ దేవరకొండ, వైష్ణవ్ తేజ్, విక్రమ్, ధృవ్ వంటి హీరోల చిత్రాలకు స్టైలిస్ట్ గా పనిచేసారు. అయితే మేనమామ వర్మ తెరకెక్కించిన సినిమాలకు మాత్రం ఆమె పనిచేసిందా? లేదా? అన్నది తెలియాల్సిన అంశం. విజయ్ తో ఆమెకు మంచి స్నేహం ఉంది. తనకు విజయ్ విజయ్ బ్రదర్ లాంటి వాడు అని శ్రావ్య ఎన్నో సందర్భాల్లో బయట పెట్టింది.



రష్మిక

## యూఎస్‌లో పుష్ప 2 ప్రీమియర్ టికెట్ ధరలు ఎంతంటే?




యూఎస్‌లో ఎక్కువగా ఎక్కువ పబ్లిక్ అటెన్షన్ ఉన్న ఈవెంట్ సినిమాల టికెట్స్ ని భారీ ధరలకి అమ్ముతారు. ముఖ్యంగా హాలీవుడ్ సినిమాలకి మాత్రమే గతంలో ధరలు పెంచుకునే సౌలభ్యం ఉండేది. అయితే ఇండియాలో బ్రాండ్ క్రియేట్ అయ్యాక యూఎస్ లో కూడా సినిమాలకి ఆదరణ పెరిగింది. జక్కన్న సినిమాల టికెట్ ధరలు పెంచుకునే అవకాశం ఉండేది. ఆయన సినివపాన్ ఇండియా ట్రెండ్ వచ్చిన తర్వాత ముఖ్యంగా తెలుగు హీరోల సినిమాలకి యూఎస్ లో డిమాండ్ పెరిగింది. అక్కడ మన పాన్ ఇండియా సినిమాలకి ప్రీమియర్స్ షోలు భారీగానే వేస్తున్నారు. పబ్లిక్ నుంచి కూడా ఈ ప్రీమియర్ షోలకి విపరీతమైన స్పందన వస్తోంది. అందుకే తెలుగు పాన్ ఇండియా హీరోల సినిమాల ప్రీమియర్ షోల టికెట్స్ ఎక్కువ ధరకి అమ్మడం మొదలయ్యింది. ఈ ఏడాది రిలీజ్ అయిన ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' మూవీకి టికెట్ ధరలు పెంచి అమ్మారు. ఇది క్రేజీ లీక్ ప్రేక్షకుల నుంచి ఈ సినిమాకి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఎన్టీఆర్ 'దేవర టికెట్ ధరలు కూడా ఎక్కువగానే నిర్ణయించి నెల రోజులు ముందుగానే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేశారు. ఇప్పుడు పుష్ప 2 మూవీ ప్రీమియర్ షోలకి సంబందించిన అడ్వాన్స్ బుకింగ్స్ లలో కూడా టికెట్స్ ని భారీ ధరకి అమ్ముతున్నారు. తెలుగు వెర్షన్ ని ఎక్స్.డి స్క్రీన్స్ లో ఒక్కో టికెట్ ధర 31.89 డాలర్లుగా నిర్ణయించారు. స్టాండర్డ్ స్క్రీన్స్ లలో 26.89 డాలర్లకి టికెట్స్ అమ్ముతున్నారు. %యాశ్రీంశీ =ఘుస% - దళపతితో 'లియో 2'పై లోకేష్ కనగరాజ్ బిగ్ అప్‌డేట్ హిందీ వెర్షన్ 18.89 డాలర్స్ గా ధర నిర్ణయించారు. టికెట్ రేట్లు అధికంగా ఉన్న కూడా ప్రీమియర్ షోలకి బుకింగ్స్ మాత్రం అద్భుతంగా జరుగుతున్నాయని టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు యూఎస్ లో ప్రీమియర్ షోలకి 3400 టికెట్లు అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా అమ్ముడయినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి వచ్చే ఆదరణ బట్టి సంక్రాంతికి రాబోయే రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' టికెట్ ధరలు కూడా నిర్ణయించే అవకాశం ఉందని అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఐకాన్ స్టార్ క్రేజ్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాలు, నార్త్ లోనే కాకుండా ఓవర్సీస్ కి కూడా పాకిందని అడ్వాన్స్ బుకింగ్స్ కి వస్తోన్న ఆదరణ బట్టి స్పష్టం అవుతోంది. ఇదే రీతిలో టికెట్ బుకింగ్స్ జరిగితే 'పుష్ప 2' ప్రీమియర్ షోల ద్వారానే యూఎస్ లో 5 మిలియన్ డాలర్స్ కలెక్ట్ చేసే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

## ఎవరూ ఏదీ ఉచితంగా చేయరు.. ఏదో ఒకటి ఆశిస్తారు: నోరా ఫతేహి



మనోహరి గీతంలో నర్తించిన నోరా ఫతేహికి ఇటు తెలుగులోను భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. అద్భుతమైన డ్యాన్సింగ్ ప్రతిభతో మతులు చెడగొట్టిన ఈ బ్యూటీ హిందీ డ్యాన్స్ రియాలిటీ షోలలో జడ్జిగా అదరగొడుతూ భారీగా ఆర్జిస్తోంది. మొరాకో నుంచి ముంబైకి ప్రయాణమైన ఈ బ్యూటీ అంతకుముందు కుటుంబ పోషణ కోసం చాలా ఉద్యోగాలు చేసింది. చివరికి షాపింగ్ మాల్ లో కూడా పని చేసానని తెలిపింది. నోరా ఫతేహి ఇటీవల బాలీవుడ్‌లో తన కఠినమైన ప్రయాణం గురించి ఓపెన్‌గా మాట్లాడింది. మెల్‌బోర్న్‌లోని IFFMలో రాజీవ్ మసంద్‌తో జరిగిన చిట్ చాట్ లో నోరా చెప్పిన సంగతులు అవాక్కయ్యేలా చేసాయి. సినీపరిశ్రమలో ప్రవేశించినప్పుడు కొత్త వ్యక్తిగా తాను అనేక క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొందో కూడా తెలిపింది. నోరా తనకు సహాయం చేయగలరని భావించిన వ్యక్తులను కలుసుకుంది. కానీ వారిలో హిడెన్ ఉద్దేశ్యాలు వేరుగా ఉన్నాయి. కొందరు ఆమెను పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లతో కనెక్ట్ చేస్తామని వాగ్దానం చేశారు. అయితే ఇది భయానక పరిస్థితులకు దారితీసింది. . ఇది క్రేజీ లీక్ అప్పటికి నోరాకు కేవలం 22 సంవత్సరాలు. కెనడా నుండి భారతదేశానికి అప్పుడే కొత్తగా వచ్చింది. అయితే ఇక్కడ అవకాశాల కోసం ప్రయత్నించే క్రమంలో కొందరు తప్పుడు వ్యక్తులను నమ్మేసిందట. వారంతా మంచి ఉద్దేశాలను కలిగి ఉన్నారని భావించినట్టు నోరా చెప్పింది. ఇప్పుడు నేను మీతో ఎందుకు వస్తున్నాను? నా నుండి నీకు ఏమి కావాలి? ... అంటే.. స్పష్టంగా.. ఎవరూ ఉచితంగా ఏమీ చేయరు.. ఏదో ఒకటి ఆశిస్తారు. కానీ ఆ సమయంలో దేవుడు ఈ వ్యక్తిని నా దగ్గరకు పంపారు అనుకుని నేను చాలా మంది ఇడియట్‌లను అనుసరించాను! అని చెప్పింది. ఈ వ్యక్తులు ఆమెను సరైన వ్యక్తులకు పరిచయం చేసినా కానీ.. వారిలో కొందరు ప్రతిఫలంగా ఏదైనా కావాలని ఆశించారు. అది అసురక్షితంగా అనిపించింది..అని నోరా తెలిపింది. ఇది నన్ను నిజంగా భయానక పరిస్థితులలోకి నెట్టింది. చివరికి ఆ వ్యక్తి చెయ్యండి.. దీని నుండి నాకేమీ రాదు అని అనేవారు. ఇది నిజంగా విచిత్రమైనది !

## ఓటీటీలోకి వచ్చేసిన సైకో థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'




పలాస మూవీ ఫేమ్ రక్షిత్ అట్లూరి ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం ఆపరేషన్ రావణ్ . ఈ సినిమాకు వెంకట సత్య దర్శకత్వం వహించగా.. ధ్యాన్ అట్లూరి నిర్మించాడు. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం జూలై 26న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సా ఫీస్ వద్ద యావరే జ్‌గా నిలిచింది. అయితే ఈ సినిమా విడుదలైన దాదాపు 4 నెలల తర్వాత ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. ఈ విషయాన్ని ఆహా వెల్లడించింది. ఈ సినిమాలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యా సాగర్, చరణ్ రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, కెఎ పాల్ రాము, విద్యా సాగర్, టీవీ5 మూర్తి, కార్తీక్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు.

## ఓటమి బాధిస్తోంది.. కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలమయ్యా



స్వదేశంలో బెబ్బులిలా గర్జించే భారత జట్టుకు ఘోర పరాభవం. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలకు గండికొడుతూ న్యూజిలాండ్ 3-0తో సిరీస్‌ను తన్నుకుపోయింది. స్వల్ప ఛేదనలో విజయం మనదే అనే ధీమాతో ఉన్న అభిమానులకు షాకిస్తూ.. రోహిత్ సేన 25 పరుగుల తేడాతో ఓడి డబ్ల్యూటీసీ పట్టికలో అగ్రస్థానం చేజార్చుకుంది. సొంత మైదానం వాంఖడేలో దారుణ ఓటమిపై హిట్‌మ్యాన్ స్పందిస్తూ.. సిరీస్ కోల్పోవడం, టెస్టు మ్యాచ్ ఓడడం చాలా బాధగా ఉందని అన్నాడు.

వాంఖడేలో ఈజీగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమిండియా టాపార్డర్ విఫలమైంది. రిషభ్ పంత్(64) ఒంటరి సైనికుడిలా పోరాడినా చివరిదాకా నిలిచి విజయాన్ని అందించలేక పోయాడు. అజాజ్ పటేల్(6/57) తిప్పేయగా న్యూజిలాండ్ చిరస్మరణీయ విజయంతో భారత జట్టును వైట్‌వాష్ చేసింది. ఊహించని పరాజయంపై రోహిత్ శర్మ ఏం అన్నాడంటే.. 'స్వదేశంలో టెస్టు సిరీస్ కోల్పోవడం జీర్ణించుకోలేని విషయం. మేము అత్యుత్తమ ఆట ఆడలేదు. సిరీస్ ఆసాంతం కివీస్ చాలా గొప్పగా ఆడింది. బెంగళూరు, పుణేలో మేము ఎక్కువ రన్స్ చేయలేదు. ఇప్పుడు వాంఖడేలోనూ 30 పరుగుల ఆధిక్యం సాధించామంతే.

## ప్యాడ్ తగిలినా ఔట్ ఇస్తారా?.. అంపైర్లపై పంత్ ఆగ్రహం



అనూహ్య మలుపులు తిరిగిన ముంబై టెస్టులో 'రిషభ్ పంత్ ఔట్ కాకపోయి ఉంటే మనం గెలిచేవాళ్లం'.. ఈ మాట మనసులో అనుకోని అభిమానులు ఉండరు. 29 పరుగులకే 4 వికెట్లు పడిన దశలో క్రీజులోకి వచ్చిన పంత్ ఓ యోధుడిలా పోరాడాడు. పర్యాటక జట్టు స్పిన్ ఉచ్చును ఛేదిస్తూ పరుగులు దొంగిలించాడు. లంచ్ తర్వాత ధనాధన్ ఆడబోయిన పంత్ అనూహ్యంగా వెనుదిరిగాడు. అజాజ్ పటేల్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్ కోసం కివీస్ ఆటగాళ్లు అప్పీల్ చేయగా ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. కెప్టెన్ టామ్ లాథమ్ రివ్యూ తీసుకొని మరీ న్యూజిలాండ్ అతడి వికెట్ సాధించింది. అసలేం జరిగిందంటే..? లంచ్ అనంతరం ఎదురు దాడికి దిగిన పంత్ అజాజ్ పటేల్ ఓవర్లో వరుసగా రెండు బౌండరీలు బాదాడు. ఆ తర్వాత బంతిని డిఫెన్స్ చేయబోగా అది గాల్లోకి లేచింది. దాంతో, అది క్యాచ్ ఔట్ అని కివీస్ ఆటగాళ్లు అప్పీల్ చేశారు. రిప్లేలో స్పైక్ కనిపించడంతో టీవీ అంపైర్ పంత్‌ను ఔట్‌గా ప్రకటించాడు. ఇదే విషయమైన పంత్ ఫీల్డ్ అంపైర్లతో వాగ్వాదానికి దిగాడు. 'బంతి నా ప్యాడ్‌కు తగిలింది' అని చెబుతూ వాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.

## వేలంలో మ్యాచ్ విన్నర్.. రికార్డు ధరకు కొనేదెవరో..?



టీ20 ఆటకు కేరాఫ్.. సుదీర్ఘ ఫార్మాట్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరు.. మెరుపు బ్యాటింగ్ చేస్తూ ఒంటిచేత్తో మ్యాచ్‌లు గెలిపిస్తుంటాడు.. అంతేనా వికెట్ కీపింగ్‌లోనూ అదరగొట్టేస్తాడు.. ఇన్ని విశేషాలు ఎవరి గురించే మీకు ఇప్పటికే అర్థమై ఉంటుంది. అవును.. భారత జట్టు వికెట్ కీపర్ రిషభ్ పంత్ గురించే. ఈ చిచ్చరపిడుగు 9 ఏండ్ల తర్వాత ఇండియన ప్రీమియర్ లీగ్ వేలానికి వస్తున్నాడు.

ఎనిమిది సీజన్లుగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు సారథిగా ఉన్న అతడిని ఫ్రాంచైజీ వదిలించుకుంది. దాంతో, పంత్ వేలంలో పాల్గొననున్నాడు. ఈసారి మెగా వేలంలో ఈ లెఫ్ట్ హ్యాండర్ రూ.25 నుంచి రూ.30 కోట్ల రికార్డు ధర పలుకుతాడని క్రీడా పండితులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ డాషింగ్ బ్యాటర్‌ను కొనేందుకు పలు ఫ్రాంచైజీలు సిద్ధమవు తున్నాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**